# ఆంధ్రప్రదేశ్ శాసన పరిషత్ కార్యకలాపాలు

**ANDHRA PRADESH**
**LEGISLATIVE COUNCIL DEBATES**

అధికార నివేదిక

# OFFICIAL REPORT

శనివారం, జూన్ **04, 2011**

పద్నాల్గవ సమావేశము, సంపుటము **IV** , నంబరు. **4**

వికృతి నామ సం. జ్యేష్ఠ శు. **3**

**SATURDAY, THE 4TH JUNE, 2011**

**FOURTEENTH SESSION, VOLUME IV, NO. 4**

**14 JYESTA, 1933 S.E.**

* * * * *


శాసన పరిషత్తు సచివాలయము,

పబ్లిక్ గార్డెన్స్,

హైదరాబాద్ – **500 004.**

**LEGISLATURE SECRETARIAT,**
**PUBLIC GARDENS,**
**HYDERABAD - 500 004.**

## ఆంధ్రప్రదేశ్ శాసన పరిషత్తు
## ప్రధాన అధికారులు

| | | |
|---|---|---|
| **చైర్మన్ (ప్రొటెం)** | : | శ్రీ సింగం బసవ పున్నయ్య |
| **చైర్మన్** | : | డా. ఎ. చక్రపాణి |
| **కార్యదర్శి** | : | డా. ఎస్. రాజ సదారామ్ |
| **అదనపు కార్యదర్శి** | | శ్రీ ఎం.వి.వి. సత్యానందం |
| **ఉప కార్యదర్శులు** | : | శ్రీ డి. నర్సింహులు |
| | | శ్రీ కె. సుభాష్ చంద్రబోస్ |
| | | శ్రీమతి వి. గిరిజాసుందరి |
| | | శ్రీ కె. సత్యనారాయణరావు |
| **ప్రత్యేక అధికారి** | : | శ్రీ ఎ. రామిరెడ్డి |
| **సహాయ కార్యదర్శులు** | : | శ్రీ మహమ్మద్ జహీరుద్దీన్ |
| | | శ్రీ జి. వెంకట కృష్ణ |
| | | శ్రీ పి. బాలకృష్ణమాచార్యులు |
| | | శ్రీమతి వై. వెంకట రమణమ్మ |
| | | శ్రీమతి బి. నరసమ్మ |
| | | శ్రీమతి టి. సుశీల |
| | | శ్రీ ఎం.వి.యస్. బాపిరాజు |
| | | శ్రీ జె. రామలింగేశ్వర రావు |
| | | శ్రీ ఎల్. తిరుమల రావు |
| | | శ్రీ కలవచెర్ల వెంకటేశ్వర రావు |
| | | శ్రీ ఎమ్. విజయరాజు |
| | | శ్రీ హెచ్.ఎ. షఫీ |
| | | శ్రీ వి. రమేష్ కుమార్ |
| **చీఫ్ మార్షల్** | : | శ్రీ సిహెచ్.వి. చెట్టి |
| **చీఫ్ రిపోర్టర్** | : | శ్రీమతి పోరంకి శివదీక్ష |

* * * * *

**ఆంధ్రప్రదేశ్ శాసన పరిషత్తు కార్యకలాపములు**

**అధికార నివేదిక**

**శనివారం, జూన్ 4, 2011**

**విషయ సూచిక**

1. విషయం ః

1. ఛైర్మన్ ఎన్నిక (సాయంత్రం 4.00 గంటలకు)
2. డిప్యూటీ ఛైర్మన్ ఎన్నిక (సాయంత్రం 5.00 గంటలకు)

* * * * *

ఆంధ్రప్రదేశ్ శాసనపరిషత్తు

**2011, జూన్ 04వ తేది, శనివారం**

పధ్నాల్గవ సమావేశానికి సంబంధించి రెండవ విడత సమావేశాల మొదటి రోజు

(సభ సాయంత్రం **04.00** గంటలకు ప్రారంభమైనది. మిస్టర్ ఛైర్మన్ (ప్రోటెం) అధ్యక్ష స్థానంలో ఉన్నారు.)

----

(వందేమాతర గీతాలాపనతో సభ ప్రారంభమైనది)

మిస్టర్ ఛైర్మన్ (ప్రోటెం) : శాసనమండలి గౌరవ సభ్యులందరికీ నమస్కారం. ఈ రోజు మనకున్న అజెండా ప్రకారం మొదట శాసనమండలి అధ్యక్షులను ఎన్నుకోవడం జరుగుతుంది. తదుపరి, వారు ఉపాధ్యక్షుని ఎన్నుకునే ప్రక్రియను చేపడతారు. ఈ సందర్భంలో అధ్యక్ష పదవికి సంబంధించి వచ్చిన నామినేషన్ల విషయమై చెప్పదలచాను. ఇందుకు సంబంధించి మొత్తం 15 నామినేషన్లు రావడం జరిగింది. అన్నీ కూడా డా. ఎ. చక్రపాణి గారి పేరునే ప్రతిపాదించడం జరిగింది.

(సభ్యుల హర్షధ్వానాలు)

## ANNOUNCEMENT

MR.CHAIRMAN (PRO-TEM) : I am to announce to the House that under Rule 9 of the Ad-hoc Rules of Procedure and Conduct of Business in the Andhra Pradesh Legislative Council firstly I will read out the names of the duly nominated members to the Office of the Chairman together with their proposers:

| Sl.No. | Name of the Candidate | Name of the Proposer |
|---|---|---|
| 1. | Dr. A. Chakrapani | Sri S. Indrasian Reddy |
| 2. | Dr. A. Chakrapani | Sri K. Rosaiah |
| 3. | Dr. A. Chakrapani | Sri Yellareddigari Sivarami Reddy |
| 4. | Dr. A. Chakrapani | Sri Paladugu Venkata Rao |
| 5. | Dr. A. Chakrapani | Sri Mohammad Jani |
| 6. | Dr. A. Chakrapani | Sri S. Jagadeeshwar Reddy |
| 7. | Dr. A. Chakrapani | Sri B. Changal Rayudu |
| 8. | Dr. A. Chakrapani | Sri R. Padma Raju |
| 9. | Dr. A. Chakrapani | Sri Ilapuram Venkaiah |
| 10. | Dr. A. Chakrapani | Sri M.S. Prabhakar Rao |
| 11. | Dr. A. Chakrapani | Sri Vitapu Balasubramanyam |
| 12. | Dr. A. Chakrapani | Sri Nethi Vidyasagar |
| 13. | Dr. A. Chakrapani | Sri B. Mohan Reddy |
| 14. | Dr. A. Chakrapani | Sri M. Ranga Reddy |
| 15. | Dr. A. Chakrapani | Sri Ponguleti Sudhakar Reddy |

As Dr. A. Chakrapani is the only duly nominated candidate, I declare Dr. A. Chakrapani as elected to the Office of the Chairman. I heartily congratulate Dr. A. Chakrapani on his election as Chairman and request him to occupy the Chair. I request the Chief Minister, Leader of Opposition and other party leaders to conduct him to the Chair".

(At this stage, as requested by the Chairman Pro-Tem, the Hon'ble Chief Minister, Hon'ble Leader of Opposition and other Parties Leaders conducted Dr. A. Chakrapani to the Chair, thus Dr. A. Chakrapani occupied the Chair and conducted the proceedings of the House)

**(DR. A. CHAKRAPANI, CHAIRMAN IN THE CHAIR)**

శ్రీ ఎన్. కిరణ్‌కుమార్ రెడ్డి (పీలేరు) : అధ్యక్షా, నాకు తెలిసినంతవరకూ ఈ రోజు రాష్ట్రంలో రెండు సభలకు సంబంధించి ఒక పక్క సభాపతి, ఉప సభాపతి ఎన్నిక, మరోపక్క శాసనమండలికి అధ్యక్షులు, ఉపాధ్యక్షుల ఎన్నిక మొట్టమొదటిసారిగా జరుగుతున్నాయి. ఖాళీ అయిన పదవులను భర్తీ చేయాల్సిన పరిస్థితుల దృష్ట్యా, శాసన మండలి అధ్యక్ష పదవికి ఎవరిని ఎన్నుకోవాలనే ఆలోచన వచ్చినప్పుడు కాంగ్రెస్ పార్టీలో గానీ, ఇతర పార్టీలలో గానీ శాసనమండలికి సంబంధించి అందరూ ప్రతిపాదించిన ఏకైక పేరు డా. ఎ. చక్రపాణిగారు. గతంలో వారు చాలా చక్కగా సభను నిర్వహించారు కాబట్టి వారి పేరును ప్రతి ఒక్కరు కోరడం జరిగింది. ఇందుకు నాతో సహా ప్రతి ఒక్కరు సంతోషించడం జరిగింది. ఆయన ఛైర్మన్ అయినందుకు సంతోషిస్తూ, ఈ సభను సజావుగా నడపడానికి గౌరవ సభ్యులందరి మద్దతు ఉంటుందని తెలియచేస్తున్నాను.

డా. ఎ. చక్రపాణిగారు గతంలో మండలి రద్దు అయినప్పుడు కూడా శాసన మండలి ఉపాధ్యక్షులుగా ఉండడం జరిగింది. ఇప్పుడు వారిని రెండవ సారి అధ్యక్షులుగా ఎన్నుకోవడం జరిగింది. నేను శాసనసభ సభాపతిగా పనిచేసిన కాలంలో ప్రిసైడింగ్ ఆఫీసర్ల సమావేశంలో గమనించిన అంశమేమంటే డా. ఎ. చక్రపాణిగారిని మనమందరం ఏ విధంగా గౌరవిస్తామో, అదే విధంగా దేశంలో ఉండే ప్రతి ఒక్క ప్రిసైడింగ్ ఆఫీసర్ ఆయనను గౌరవిస్తారు. పెద్దలలో పెద్దగా, మా వయసువారితో మాలో ఒకరుగా, చిన్నవారితో వారిలో ఒకరుగా - ఈ విధంగా ఎవరితోనైనా కలిసిపోయే స్వభావం గల వ్యక్తి డా.ఎ. చక్రపాణిగారు.

సా. 4.10

'ప్రిసైడింగ్ ఆఫీసర్స్ సమావేశాల'కు సంబంధించి ప్రతి రాష్ట్రానికి సంబంధించిన శాసన సభ సభాపతి గానీ, శాసన మండలి అధ్యక్షులు గానీ హాజరుకావడం జరుగుతుంది. ఇందుకు సంబంధించిన అనేక అంశాలు ప్రత్యేకంగా తెలిసిన వ్యక్తి తమరు. చట్టసభలలో ప్రజలకు సంబంధించిన అంశాలపై చాలాసార్లు రాజకీయంగా నిర్ణయాలు తీసుకోబడతాయి. ఏ కారణంగా మండలిని తిరిగి నెలకొల్పామో, ఆ కారణంతో చర్చలు జరగాలని భావించేవారిలో తమరు ఒకరు. రాజకీయాలకు అతీతంగా బడుగు, బలహీన వర్గాల అభివృద్ధికి, రాష్ట్రాభివృద్ధికి సంబంధించి అనేక చర్చలు జరిగి, అందరికీ ఉపయోగంగా ఉంటుందనే ఉద్దేశ్యంతో శాసనమండలిని నెలకొల్పడం జరిగింది. శాసనమండలిలో అయితే వాటి మీద కూలంకషంగా చర్చలు జరపడంలో తమ పాత్ర అత్యంత కీలకమైనది మరియు అదే విధంగా కొనసాగే బాధ్యతను నిర్వహిస్తున్నారు. గతంలో అనేకసార్లు శాసనసభలో జరగనప్పుడు కూడా ఈ సభలో చాలా అర్ధవంతమైన చర్చలను చేపట్టడం జరిగింది. ఈ రోజు చక్రపాణి గారిని మరోసారి ఛైర్మన్‌గా మనమందరం కూడా ఒక మంచి సాంప్రదాయం ప్రకారం ఏకగ్రీవంగా ఎన్నిక చేసుకోగలిగాము. ఇటువంటి సాంప్రదాయాన్ని ఆయన ఖచ్చితంగా కాపాడుతూ, మనందరినీ గౌరవించి, సభ్యులందరికీ అవకాశం ఇస్తూ, మంచి పేరు తెచ్చుకున్నారు. ప్రజాసమస్యలను ఏ

విధంగా చర్చకు తీసుకురావాలనే విషయంపై ప్రత్యేక దృష్టి సారించి, ప్రత్యేకంగా వెనకపడిన ప్రాంతాలకు సంబంధించిన సమస్యలపై, ఎస్.సి. ఎస్.టి. మరియు మైనారిటీలకు సంబంధించిన సమస్యలపై శాసనమండలిలో ఎక్కువగా చర్చలు జరపడం జరిగింది. అదేవిధంగా బడ్జెట్‌కు సంబంధించి కూడా ఎక్కువ సమయం చర్చలు జరిగేలాగా, ప్రభుత్వానికి సలహాలు ఇచ్చే విధంగా ఆయన సభను నడపగలుగుతారు. మాతోటి ఇతర మంత్రులు కూడా నేను సభాపతిగా ఉన్నప్పుడు మీరు కూడా గట్టిగా, కఠినంగా చక్రపాణి గారి లాగా ఉండాలని నాకు చెప్పేవారు. అందుకని ఖచ్చితంగా ఆ సీట్లో కూర్చున్నప్పుడు అందరినీ కలుపుకొనిపోతూ, కొన్ని సందర్భాలలో కఠినమైన నిర్ణయాలు తీసుకోవలసి ఉంటుంది. అందరికీ ఆమోదయోగ్యమైన, గౌరవించే వ్యక్తిగా మరోమారు తమరిని అధ్యక్షునిగా ఎన్నుకున్నందుకు సంతోషిస్తూ, సభను సజావుగా నడపడంలో కాంగ్రెస్ పార్టీ తరఫు నుంచి, ఇతర పార్టీల నుంచి కూడా పూర్తి మద్దతు ఉంటుందని తెలియజేస్తున్నాను. సభలో మరోమారు ఒక మంచి సాంప్రదాయం ప్రకారం ఏకగ్రీవంగా అధ్యక్షుని, అలాగే ఉపాధ్యక్షుని ఎన్నుకున్నందుకు గాను ప్రత్యేకంగా ప్రతిపక్ష పార్టీ సభ్యులు, ప్రతిపక్ష నేత దాడి వీరభద్రరావు గారికి, అలాగే ఇతర పార్టీల సభ్యులందరికీ కూడా కృతజ్ఞతలు తెలియజేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ దాడి వీరభద్ర రావు (విశాఖపట్టణం) : అధ్యక్షా, ఇటీవల మనకు సమావేశాలు అయిన తరువాత, క్రొత్తగా 30 మంది సభ్యులు నూతనంగా ఎన్నికై శాసన మండలిలో ప్రవేశించడం జరిగింది. వారందరికీ కూడా తెలుగుదేశం పార్టీ తరఫున స్వాగతం పలుకుతున్నాను. శాసనమండలి అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నుకోబడిన సందర్భంగా మీకు, అలాగే ఉపాధ్యక్షులుగా ఎంపిక కాబడిన నేతి విద్యాసాగర్ గారికి ప్రత్యేకంగా అభినందనలు తెలియజేస్తున్నాను. శాసన మండలి పెద్దల సభగా, మీరు ఛైర్మన్ అయిన దగ్గర నుంచి కూడా దాని తాలూకు హుందాతనాన్ని కాపాడుతూ వస్తున్నారు. అందుచేతనే మేము విధాన నిర్ణయం ప్రకారంగా, తెలుగుదేశం పార్టీ అభ్యర్థులను పోటీగా పెట్టాలనే ప్రతిపాదన వచ్చినప్పటికీ మా పార్టీ నేత శ్రీ ఎన్. చంద్రబాబు నాయుడు పెద్దల సభ కాబట్టి, అందునా, చక్రపాణి గారు సభను సమర్థవంతంగా నిర్వహించగలరని, ఈ శాసన మండలికి మనం పోటీ చేయవద్దని, వారు నిర్ణయం తీసుకోవడం జరిగింది. ఈ విషయంలో అన్ని పార్టీల వారు సహకరించారు. ఏకగ్రీవంగా ఈ రెండు పదవులకు ఎన్నికలు జరిగిన సందర్భంలో మరోసారి నా అభినందనలను తెలియజేస్తున్నాను. ఈ సందర్భంగా ముఖ్యమంత్రిగారిని కూడా అభినందిస్తున్నాను. ఎందుచేతనంటే, కాంగ్రెస్ పార్టీ వారు అప్పుడప్పుడు, అడపాదడపా మంచి పనులు చేస్తారనడానికి చక్రపాణి గారి ఎన్నిక ఒక ఉదాహరణ. చక్రపాణిగారిని ఛైర్మన్‌గా ఎన్నిక చేయడం మీ మంచి పని...

(సభలో సభ్యుల నవ్వులు)

చక్రపాణి గారు జగమెరిగిన బ్రాహ్మణులు. వారి గురించి పరిచయం చేయవలసిన అవసరం లేదు, దీనికి సంబంధించి ముఖ్యమంత్రిగారు చాలాసార్లు చెప్పారు. ఇందిరాగాంధీ గారు ఉన్నప్పటి నుంచి వారితో సన్నిహితమైన సంబంధాలను కలిగి ఉంటూ, మన రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన పెట్టిన సందర్భంలో కూడా ఈ రాష్ట్ర కాంగ్రెస్ అడ్‌హాక్ కమిటీకి సారథ్యం వహించినటువంటి సందర్భాలు మేమెవరం కూడా మరచిపోలేము. ఆనాడు రాష్ట్రం చాలా సంక్లిష్ట పరిస్థితిలో ఉన్నటువంటి సమయంలో, రాష్ట్రంలో బాధ్యాతాయుతమైన పరిపాలన చేయవలసిన సమయంలో వారు ప్రధానమైన పాత్రను పోషించడం జరిగింది. రాజశేఖర్ రెడ్డిగారి సారథ్యంలో శాసన మండలి ఏర్పాటవ్వాలనే నిర్ణయం తీసుకోబడినప్పటికీ, చక్రపాణి గారు ప్రత్యేకమైన శ్రద్ధ తీసుకుని పార్లమెంటులో దీనికి సంబంధించి అప్రూవల్ తీసుకురావడానికి చాలా కృషి చేయడం జరిగింది.

మిస్టర్ ఛైర్మన్ : రాజశేఖర్ రెడ్డి గారు మొదటిసారిగా ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు, శ్రీ ఎన్. కిరణ్ కుమార్ రెడ్డి ఛీఫ్ విప్‌గా ఉన్నప్పుడు ఆయన కూడా రిజల్యూషన్‌ను పాస్ చేయించారు.

శ్రీ దాడి వీరభద్రరావు : వారికి కూడా ప్రత్యేకంగా అభినందనలు తెలియజేస్తున్నాను. రోశయ్య గారు కూడా ఇందులో సభ్యులే, వారికి ప్రత్యేకించి అభినందనలు తెలియచేయనక్కరలేదు. ఆ విధంగా బాధ్యత కలిగినటువంటి పదవులలో ఉండడమే కాకుండా, ఈ కౌన్సిల్ ఏర్పాటు చేయడంలో తగిన శ్రద్ధ తీసుకుని, ప్రస్తుతం ఈ విధంగా కౌన్సిల్‌ను నడపడానికి తగినటువంటి శ్రద్ధ తీసుకుంటున్నదుకు అభినందనలను తెలియజేస్తున్నాను. అంతేగాకుండా, శాసనమండలి తాలూకు స్థాయిని కూడా అదేవిధంగా కొనసాగించడం ప్రధానం. రాజకీయాలకు అతీతంగా సభను చాలా బాగా నడుపుతున్నారని ఇప్పుడే ముఖ్యమంత్రిగారు కూడా అన్నారు. ఇదే మాట రోశయ్య గారు కూడా అనేక పర్యాయాలు మనలను అభినందించారు. రాజశేఖర్ రెడ్డి గారు కూడా ఇదే వేదిక మీద ఎన్నోసార్లు మనందరినీ అభినందించారు.

మిస్టర్ ఛైర్మన్ : అది మీరందరూ సహకరించినప్పుడే సాధ్యమవుతుంది.

శ్రీ దాడి వీరభద్రరావు : మా సహకారం ఉన్నప్పటికీ కూడా మమ్మల్నందరినీ, అన్ని వర్గాలను కలుపుకుని, తగినటువంటి న్యాయం చేస్తూ, సభను నడిపిన గౌరవం మీకే దక్కుతుందని మరొకసారి తెలియజేస్తున్నాను. అయితే, ఇంకా చేయవలసిన పనులు చాలా ఉన్నాయి. తమ సారథ్యంలో చేయవలసిన వాటిలో కౌన్సిల్‌కు సంబంధించి ముఖ్యమంత్రిగారు కూడా ఇక్కడ ఉన్నారు కాబట్టి, దీనికి ఒక ఇండిపెండెంట్ స్టేటస్ కావాలనేది మేము కోరుతున్నాము. శాసనమండలికి ఇండింపెండెంట్ స్టేటస్ ఉంటూ, దీనికి ఒక ప్రత్యేకమైన కార్యదర్శి ఉండవలసిన అవసరం మరియు ఫైనాన్షియల్ స్టేటస్‌ను కూడా కల్పించవలసిన అవసరం ఉంది. ఎందుకంటే, ప్రతి పనికి ఫైనాన్స్ డిపార్టుమెంట్‌కు వెళ్లే పని లేకుండా, కౌన్సిల్‌లో ఛైర్మన్‌గారు, అసెంబ్లీలో స్పీకర్‌గారు కూడా ప్రత్యేకమైన వ్యక్తులు అయినప్పటికీ, వీరికి ఆర్థికపరమైన అంశాలపై పూర్తి అధికారాలు లేనటువంటి పరిస్థితులు ఈనాటికీ ఉన్నాయి. కాబట్టి, దాని స్వరూపాలను మార్చవలసిన అవసరం ఉంది. శాసన సభకు సభాపతిగా పనిచేసి, ఇప్పుడు ముఖ్యమంత్రిగా ఉన్నటువంటి కిరణ్ కుమార్ రెడ్డి గారు ఈ పని చేయడానికి ముందుకు వస్తారని ఆశిస్తున్నాను. శాసనమండలికి ఇండిపెండెంట్ స్టేటస్‌ను కల్పించినట్లయితే, దీనికి ఒక పరిపూర్ణత్వం రావడం జరుగుతుంది. అదేవిధంగా శాసన మండలికి నూతనంగా ఒక భవనాన్ని ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని అనేక సందర్భాలలో కోరాము. దీనికి ముఖ్యమంత్రులందరూ హామీ ఇచ్చారు కానీ, ఒక్క రోశయ్య గారు మాత్రం ఆర్థిక శాఖా మంత్రి కాబట్టి, ఉండండి, కొంచెం ఆలోచిద్దామన్నారు, ఇప్పుడు వారు కూడా మన మండలి సభ్యులే కాబట్టి వారు కూడా ప్రభుత్వంపై ఎక్కువ ఒత్తిడి తీసుకురావాలని అసెంబ్లీని, కౌన్సిల్‌ను కలుపుతూ మధ్యలో ఒక సెంట్రల్ హాల్‌కు సంబంధించి కూడా గతంలో ఒక ప్లానును తయారు చేయడం జరిగిందని రాజశేఖర్ రెడ్డి గారు గతంలో చెప్పడం జరిగింది. దానిని మీరు ఇప్పుడైనా పరిశీలన చేయడం ద్వారా శాశ్వత ప్రాతిపదిక మీద ఈ మండలికి న్యాయం చేసిన వారవుతారని ఈ ప్రభుత్వానికి నేను సూచన చేయడం జరుగుతోంది. అదేవిధంగా రాష్ట్ర మంత్రి పదవులకు సంబంధించి శాసనమండలి సభ్యుల తాలూకు కోటా, వాటాను ఇవ్వవలసిందిగా కోరుతున్నాను.

సా.4.20.

అధ్యక్షా, శాసనమండలి నుండి ఇప్పటివరకు మంత్రిపదవిలో శ్రీ వివేకానంద రెడ్డి గారు, ముఖ్యమంత్రి గారు, రోశయ్యగారు ఉండేవారు. గతంలో ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి కూడా ఈ సభ నుండి ఎన్నికైన వారే. అయితే ప్రస్తుతం ఇక్కడి సభ్యులెవరూ మంత్రులుగా లేరు. అందుకే శాసనమండలి నుండి కొంత మంది సభ్యులకైనా మంత్రిమండలిలో అవకాశం కల్పిస్తారనిఆశిస్తూ, మరొక్కసారి ఛైర్మన్‌గారికి అభినందనలు తెలియ జేస్తున్నాను.

శాసనమండలి తరఫున మీతోపాటు అనేక కమిటీలలో మేము కూడా పాల్గొనడం జరిగింది. ఆ సంద ర్భంలో ఢిల్లీలోని పార్టీ పెద్దలతో, ప్రభుత్వ పెద్దలతో సన్నిహితంగా ఉండడం మేము చూడడం జరిగింది. పార్ల మెంట్ స్పీకర్ మీరా కుమార్‌గారు కూడా మీరు చేసిన అభివృద్ధి కార్యక్రమాల గురించి అభినందనలు తెలియజే శారు. స్టాండింగ్ కమిటీస్‌ను ఏర్పాటు చేయడంలో కూడా ఛైర్మన్‌గా మీరు ప్రత్యేకమైన శ్రద్ధ చూపారు. స్టాండింగ్ కమిటీ మీద పరిశీలన చేయడానికి ఒక కమిటీని వేయమని గౌరవ సభ్యులు ఛైర్మన్‌గారిని కోరినపుడు వారందుకు అంగీకరించగా, దానిపై రోశయ్యగారు ఒక స్టడీ కమిటీ వేశారు. అందులో మేము కూడా సభ్యు లుగా ఉండడం జరిగింది. ఒకానొక సందర్భంలో స్టడీ కమిటీ శాసనమండలి ఉన్న రాష్ట్రాలతోపాటు ఢిల్లీలో పార్ల మెంట్ సభ్యులతోపాటు, స్పీకర్‌గారితోను, ప్రధానమంత్రిగారితో చర్చించినపుడు, ''స్టాండింగ్ కమిటీస్''ను ఏర్పాటు చేయమని రోశయ్యగారితో తాను చెప్పానని చెప్పమని ప్రధానమంత్రిగారు ప్రత్యేకంగా కోరడం జరి గింది. తదనుగుణంగా ఉభయ సభలను కలుపుకొని స్టాండింగ్ కమిటీ నియమించినట్లయితే పరిపాలనలో పారదర్శకత ఉంటుందనేది మా అభిప్రాయం. అటువంటి ప్రయోగాలన్నింటికీ శ్రీకారం చుట్టి, ఈ శాసన మండలి తాలూకు గౌరవ ప్రతిష్టలు పెంచేందుకు కృషి చేస్తున్న మీకు మా సహాయ సహకారాలు సంపూర్ణంగా ఉంటుందని తెలియజేస్తున్నాము. అదేవిధంగా అధ్యక్ష స్థానంలో మీరు లేనటువంటి సమయంలో డిప్యూటీ ఛైర్మన్‌గా పనిచేసిన మహమ్మద్ జానీ గారు చాలా సమర్థవంతంగా పనిచేశారు. తాత్కాలిక ఛైర్మన్‌గా బసవ పున్నయ్యగారు కూడా ఇటీవల 30 మంది శాసనమండలి సభ్యులచేత ప్రమాణ స్వీకారం చేయించే బాధ్యతను తీసుకున్నారు. వారందరికీ కూడా మరొకసారి నా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.

(గౌరవ సభ్యుల చప్పట్లు)

శ్రీ జల్లి విల్సన్ (కృష్ణా) : అధ్యక్షా, మీరు ఛైర్మన్‌గా ఈ సభకు ఏకగ్రీవంగా ఎన్నికైనందుకు మా భారత కమ్యూనిస్ట్ పార్టీ తరఫున, నా తరఫున మీకు అభినందనలు తెలియజేస్తున్నాము. అలాగే ఇవాళ ఉన్నటువంటి రాజకీయ వాతావరణాన్ని మరింత కలుషితం చేయకుండా ఉండేందుకు శాసనసభలో కానీ, శాసనమండలిలో కానీ పోటీ లేకుండా చేయాలనే ఉద్దేశ్యంతోనే మీరు ఏకగ్రీవంగా ఎన్నికయ్యేందుకు మా పార్టీ నుంచి తోడ్పడం జరిగింది. మీరు చక్రపాణి గారనే పేరుకు తగినట్లే గత నాలుగు సంవత్సరాల కాలంలో శాసన మండలి యొక్క అవసరాన్ని రాష్ట్ర ప్రజలందరికీ తెలియజేయడం జరిగింది. శాసనమండలి సమావేశాలలో ఆహ్లాదకర మైన వాతావరణంలో అర్థవంతమైన చర్చలు జరుపుతారనే చరిత్ర మనకు ఉంది.

ముఖ్యమంత్రిగారు సెలవిచ్చినట్లు ఇకముందు కూడా రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల యొక్క సమ స్యల మీద చర్చించి పరిష్కారం చూపించడానికి శాసనమండలి తోడ్పడుతుందని నేను భావిస్తున్నాను. అలాగే

దాడి వీరభద్రరావుగారు చెప్పిన అంశాలమీద ఏకీభవిస్తూ, సభ్యులయొక్క హక్కు అయిన ప్రశ్నోత్తరాల సమయాన్ని అందరికీ కేటాయించి మాకు కూడా అవకాశాన్ని కల్పిస్తారని ఆశిస్తున్నాము. రాబోయే కాలంలో శాసన మండలి యొక్క హోదా, గౌరవం పెంచడానికి మా పార్టీ తరపు నుంచి పూర్తి సహకారం ఉంటుందని, అలాగే ఏకగ్రీవంగా ఎన్నికైనందుకు మీకు, ఎన్నిక చేసినందుకు కాంగ్రెస్ పార్టీకి, సభ్యులందరకూ మరొక్కసారి అభినందనలు తెలియజేస్తూ శెలవు తీసుకుంటున్నాను.

శ్రీ బి.మోహన్ రెడి (ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, మహబూబ్‌నగర్ ) : అధ్యక్షా, కొత్తగా ఎన్నికైటువంటి 30మంది శాసనమండలి సభ్యులకు స్వాగతం తెలియజేస్తూ కిరణ్‌కుమార్‌రెడ్డి గారి ఆధ్వర్యంలో వారి నాయకత్వంలో మీరు ఛైర్మన్‌గా అవుతారని నేను నొక్కి వక్కాణించి చెప్పాను.

(సభలో నవ్వులు)

మీరు న్యాయశాస్త్రంలో ప్రవీణులు అవడం, సభను ఎలా నడపాలో మీకు తెలియడం వల్ల మీరు మళ్ళీ ఛైర్మన్‌గా ఎంపిక కావడానికి కారణమైంది. ముఖ్యమంత్రి, మంత్రులకు శాసనమండలి మీద మంచి అవగాహన కల్పించడంతోపాటు, సభలో ఉద్రిక్త వాతావరణంలో చర్చలు జరుగుతున్నప్పుడు మంచి ఛలోక్తులు వేస్తూ సమావేశాన్ని ఒక పద్ధతిలో నడుపుతూ గౌరవ సభ్యుల యొక్క మనసులను ఆకట్టుకున్నారు కనుక ఖచ్చితంగాఈ పదవి మీకే వస్తుందని మేము భావించాము. అదే విషయాన్ని మీ దృష్టికి తీసుకురావడం కూడా జరిగింది. ఆంధ్రప్రదేశ్‌లో మళ్ళీ శాసనమండలి ఏర్పాటుకు కాంగ్రెస్ ప్రభుత్వం, స్వర్గీయ రాజశేఖర రెడ్డిగారు, కిరణ్‌కుమార్ రెడ్డి గారూ ప్రత్యేకమైన కృషి చేశారు. రోశయ్యగారు ఈ సభలో ఉండడం గర్వ కారణం. వారి తరానికి సంబంధించిన వ్యక్తులందరూ అంతరించి పోతున్నారు. వారొక్కరే మిగిలారు.

(సభలో నవ్వులు)

అధ్యక్షా, రోశయ్యగారు గవర్నర్‌గా వెళతారనే ఉద్దేశ్యంతోనే చెప్పాను తప్ప వేరే ఏ కారణంతో ఈ విధంగా చెప్పలేదు. మీ శక్తి, యుక్తులతో సభను నడపడం మీకే సాధ్యమైంది. అదే విధంగా పెద్దల సభకు పెద్దవారైన మిమ్మల్ని ఛైర్మన్‌గా ఎంపిక చేయడంలో కీలకపాత్ర వహించిన కిరణ్‌కుమార్‌రెడ్డిగారిని కూడా అభినందించాలి. శాసనమండలి సభ్యులు కొందరినైనా మంత్రులుగా నియమించకపోవడం వల్ల ఈ సభ యొక్క గౌరవం తగ్గిపోతోందనేది కొంత బాధాకరమే. దేశంలోని మిగిలిన రాష్ట్రాలలోని శాసన మండలిని పరిశీలిస్తే, బీహారులో ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రితోపాటు శాసనమండలి నుంచి మొత్తం ఎనిమిది మంది మంత్రులుగా ఉండగా, ముంబాయి శాసనమండలి నుండి ఆరుగురు మంత్రులుగా ఉన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం శాసనమండలిని తీసుకొస్తేనే మాకందరికీ కూడా సభ్యులుగా అవకాశం వచ్చింది. ఆ గౌరవం మాకు ఎప్పుడూ ఉంటుంది కాబట్టి మన శాసనమండలి నుండి కూడా ఒక ముగ్గురో, నలుగురో సభ్యులకు మంత్రి పదవులిస్తే ఈ సభకు కూడా విలువ పెరుగుతుంది. పెద్దల సభ అని మాటల ద్వారానే గాకుండా చేతల ద్వారా కూడా చూపెట్టాల్సిన అవసరం ఉంది. కానీ ఎమ్మెల్యేలకు ఉన్న విలువ ఎమ్మెల్సీలకు లేదు. కాబట్టి విలువ పెంచడానికి చేయాల్సిన కృషి గురించి కూడా పరిశీలించాల్సిన అవసరం ఉంది. బీహార్‌లో శాసన సభ, శాసన మండలి ఏ విధంగా ప్రత్యక్ష ప్రసారాలు జరుగుతున్నాయో అదే పద్ధతిలో ఇక్కడ కూడా

చేయాల్సిన అవసరం ఉందని కోరితే స్థలాభావం వల్ల చేయడానికి వీలుకాదంటున్నారు. స్థలం సరిపోకపోతే ఒక ప్రణాళిక సిద్ధం చేసి నగరానికి వెలుపల ఎక్కువ స్థలంలో వీటిని నిర్మించడానికి గల అవకాశాలను పరిశీలించాలి.

సా. 4.30,

శాసన మండలి అంటే పెద్దల సభ, అన్ని విషయాల పై చర్చలు జరిపి మంచి నిర్ణయాలు తీసుకుంటారు, శాసనాల చేయడంలో మంచి చెడులను విశ్లేషిస్తారనే విషయాన్ని ప్రజలకు, ముందు తరాలకు తెలియజేయాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు సంబంధించి మంత్రులు చాలా సార్లు హామీలు ఇచ్చారు కానీ ఆ హామీలకు జి.ఓలు మాత్రం రావడం లేదు. ముఖ్యమంత్రిగారు ఒప్పందంచేసుకున్న వాటికి మాత్రం జి.ఓలు ఇచ్చారు. ఏది ఏమైనప్పటికీ ఈ సభకు మీరు గౌరవం తీసుకురావాలని తెలియచేస్తూ మరోసారి మిమ్మల్ని, మీ సేవల్ని అభినందిస్తూ, గతంలో ఈ శాసన మండలిని లైవ్‌గా ఉంచడానికి ఏవిధమైన కృషి చేశారో అదే పద్ధతిలో రాబోయే కాలంలో కూడా శాసనమండలిని నడిపించడానికి భగవంతుడు మీకు అన్నివిధాలా సహకరించాలని కోరుతూ, మీకు ధన్యవాదాలు తెలుపుతూ ముగిస్తున్నాను.

శ్రీ కపిలవాయి దిలీప్ కుమార్ (వరంగల్, ఖమ్మం, నల్గొండ ) : అధ్యక్షా! మరొకసారి ఈ సభకు మీరు ఏకగ్రీవంగా ఎన్నిక అయినందుకు మిమ్మల్ని అభినందిస్తున్నాను. అత్యంత సమర్థవంతంగా మీరు ఈ సభను నిర్వహించారు. నిజంగా పెద్దల సభ ఎలా ఉండాలో ఆ విధంగా మీరు సభను తీర్చిదిద్దారనడంలో అతిశయోక్తి లేదు. ఈ సభలో మీ ఆధ్వర్యంలో, మీ అధ్యక్షతన పనిచేయడానికి గర్వించదగినన్ని సందర్భాలు ఎన్నో ఉన్నాయి. మా హక్కులను కూడా మీరు కాపాడారు. అసెంబ్లీలో కంటే కౌన్సిల్ లోనే చాలా ప్రశాంతంగా చర్చ జరపడానికి అవకాశం ఉంటుందని చాలా మంది అంటూంటే విన్నాను, కౌన్సిల్‌కు ఈ తరహా గౌరవం రావడానికి ఒక రకంగా మీరే కారణం అనేది అతిశయోక్తి కాదు. మీ ఆధ్వర్యంలో ఈ సభ మరిన్ని శాసనాలు చేయాలని, అర్థవంతమైన చర్చలు జరపాలని, ప్రజలు గౌరవించే ప్రజల సభలో మనం ఉన్నాము కాబట్టి ఆ గౌరవాన్ని కాపాడడానికి మేమందరము కలిసి పనిచేసే విధంగా మాకు ఒక దశ, దిశ నిర్ధేశించాలని, గతంలో మీరు చేసిన సేవలను కొనియాడుతూ రాబోయే కాలంలో కూడా మా అందరి సహకారం మీకు ఉంటుందని మా అందరి తరపున ప్రత్యేకంగా అభినందనలు తెలియచేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

(Sri Syed Altaf Hyder Razvi)

جناب سید الطاف حیدر رضوی: عالی جناب چیرمین صاحب! قانون ساز کونسل، آندھراپردیش کے چیرمین کے عہدہ پر آپ کے دوبارہ انتخاب پر مجلس اتحادالمسلمین کی جانب سے میں مبارک باد پیش کرتا ہوں، اور میں یہ توقع کرتا ہوں کہ جس طرح پچھلے چار سالوں کی مدت میں آپ نے مسلمانوں کے مختلف مسائل پر بات کرنے کا جو موقع دیا، چاہے وہ اقلیتوں کا مسئلہ ہو یا backward classes کا مسئلہ ہو یا پھر کوئی بھی مسئلہ ہو، اسی طرح سے آئندہ بھی آپ ہمیں موقع دیں گے۔ انشاءاللہ میں امید کرتا ہوں کہ آپ اس عہدہ سے، اس کے پاورس سے اور اپنے طویل تجربہ سے جس طرح ہمیشہ اچھے طریقہ سے اس ہاؤز کو چلاتے ہیں اسی طرح سے آئندہ بھی آپ حسن خوبی ہاؤز کو چلانے میں بہتر خدمات انجام دیں گے اور میں پھر ایک مرتبہ مجلس اتحادالمسلمین کی طرف سے آپ کو مبارک باد دیتا ہوں۔ شکریہ۔

శ్రీ చుక్కా రామయ్య (వరంగల్, ఖమ్మం, నల్గొండ): అధ్యక్షా! మీరు మరొకసారి అధ్యక్షునిగా ఎన్నికైనందుకు పిడిఎఫ్ పక్షాన మీకు అభినందనలు తెలియచేస్తున్నాను. గడిచిన నాలుగు సంవత్సరాలకాలంలో మీ శైలిని చూసే అవకాశం నాకు దొరికింది. ఒక వాక్యంలో చెప్పాలంటే కానుస్ట్యూషనల్ మొరాలిటీని కాపాడే వ్యక్తిగా మీరు కనిపించారు. ఒక పోస్టుకు వచ్చిన తరువాత రాజ్యాంగ పరంగా వచ్చేటువంటి బాధ్యతలను మొరాలిటీగా కాపాడటం అనేది చాలా కొద్దిమంది మాత్రమే చేయగలుగుతారు. ఈ కానిస్టిట్యూషనల్ మొరాలిటీని కాపాడినందుకు ఈ రాష్ట్ర ప్రజలందరితరుపున మీకు అభినందనలు తెలుపుతున్నాను. అంతేకాకుండా ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్నటువంటి పరిస్థితులలో, మీరు ఏకగ్రీవంగా ఎన్నికవడం పట్ల ప్రజలకు మీమీద ఎన్ని ఆశలు ఉన్నాయో స్పష్టంగా కనపడుతుంది. ఆ ఆశయాలకు అణుగుణంగా వచ్చే ఆరు సంవత్సరాలు కూడా ఈ శాసన మండలిని మీరు నడిపిస్తారని ఆశిస్తున్నాను. రాష్ట్ర రాజకీయాల పట్ల మీకు బాగా అవగాహన ఉంది. మీరు ఎప్పుడూ పార్లమెంటరీ ప్రొసీజర్లు చదువుతున్నట్టుగా చూశాను. అంతే కాకుండా ప్రతి విషయాన్ని కూడా మీరొక హ్యూమన్అవుట్ లుక్‌తో చూస్తూ వచ్చారు. మీకు ఎంత హ్యూమన్ అవుట్ లుక్ ఉన్నదో అంత గొప్ప హ్యూమన్ అని కూడా చూపించారు. ఇన్ని సద్గుణాలున్నటువంటి వ్యక్తులు చాలా అరుదుగా ఉంటారు. అలాంటి అరుదైన మీలాంటి వ్యక్తి ఆంధ్రప్రదేశ్‌లో ఉన్నందుకు గర్విస్తూ, మీ యొక్క ఎన్నికను అభినందిస్తు న్నాను. మీలో అంతర్ముఖం బహిర్ముఖం రెండూ కనపడుతుంటాయి. మీరు అంతర్ముఖంగా ఉన్నప్పుడు పాలక పక్షం వైపు, బహిర్ముఖంగా ఉన్నప్పుడు ప్రతిపక్షం వైపు చూస్తూంటారని నా అభిప్రాయం. పాలక వర్గం మంత్రులు ఏవైనా సమస్యలలో ఉన్నప్పుడు చాలా సులభంగా పరిష్కార మార్గం చూపించి పాలక వర్గాన్ని కాపాడతారు, అదే విధంగా అపోజిషన్ నిర్లక్ష్యంగా ఉన్నప్పుడు వారికి రక్షణ కవచంలా నిలిచి ఉంటారు. కాబట్టే అపోజిషన్ పక్షాన మీకు అభినందనలు తెలుపుతున్నాను. మీరు పాలక వర్గానికి కవచం, మాకు రక్షణ అని చెప్పగలుగుతున్నాను. నిర్మాణాత్మక కార్యక్రమాలలో తప్పులు చూపించే వారు చాలా తక్కువ మంది మాత్రమే ఉంటారు. మేము ప్రభుత్వాన్ని విమర్శించడానికి రాలేదు. ప్రభుత్వం యొక్క తప్పులను ఎత్తి చూపి పరిపాలన యంత్రాగాన్ని ఇప్పటి కన్నా ఎక్కువ పటిష్టంగా నడిపించాలనే ఉద్దేశంతోని మేము తప్పులను సభ దృష్టికి తీసుకువస్తున్నాము. ప్రజాస్వామ్యాని కాపాడాలంటే ప్రతిపక్షమే కాపాడగలుగుతుంది, కాబట్టి ప్రతిపక్షానికి అవకాశాలు ఇచ్చినట్లయితే ప్రభుత్వ యంత్రాగానికి, పాలక వర్గానికి కూడా మంచిదని తెలియచేస్తున్నాను.

సా.4.40

సర్, మనకు పొగిడేవారు చాలా మంది దొరుకుతారు కాని వాస్తవాలు చెప్పే వారు అరుదుగా వుంటారు. కాబట్టి దయచేసి మిమ్మల్ని మరొకసారి రిక్వస్ట్ చేసి చెబుతున్నాను. మీరు ఎక్కువసేపు ఇటువైపు చూస్తూ ప్రజాస్వామ్యాన్ని కాపాడండని కోరుతున్నాను. మీరు పాత కాలం మనిషి. గతంలో మనకున్న స్పీకర్లు ఎట్లా వుండేవారో తమకు తెలుసు. వారు ప్రతిపక్షాలను ఎట్లా కాపాడేవారో మీకు తెలుసు. అటువంటి పార్లమెంటరీ ప్రాక్టీసెస్ గురించి తమకు తెలుసు కాబట్టి వాటినన్నిటినీ దృష్టిలో వుంచుకుని, రాబోయే 6 సంవత్సరాల కాలంలో శాసన పరిషత్‌ను ఆదర్శవంతంగా నడిపిస్తారని ఆశిస్తూ, ఏ ఆశలతో మిమ్మల్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారో ఆ ఆశలను మీరు నెరవేరుస్తారని ఆశిస్తున్నాను.

డెప్యూటీ చైర్మన్‌గా ఎన్నికైన విద్యాసాగర రావు గారు మా నల్గొండ జిల్లాకు చెందిన వారు. వారికి నా హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తున్నాను, చైర్మన్‌గా ఎన్నికైన తమకు మరొకసారి నా హృదయపూర్వక అభినందనలు తెలియజేసుకుంటూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ కె.రోశయ్య ( నామినేటెడ్ ) : అధ్యక్షా, లెజిస్లేటివ్ కౌన్సిల్‌లో ఒక ఉత్తమ సాంప్రదాయాన్ని గౌరవ సభ్యులందరూ నిలబెట్టారు. చైర్మన్ మరియు డెప్యూటీ చైర్మన్‌ల ఎన్నిక ఏకగ్రీవంగా జరిపారు. దిగువ సభకు భిన్నంగా ఆంధ్రప్రదేశ్ లెజిస్లేటివ్ కౌన్సిల్ వ్యవహరిస్తుందనే మాట నోటి మాటగా కాకుండా చేతలలో ప్రూవ్ చేసారు. గౌరవ సభ్యులందరినీ నేను వయసులో పెద్దవాడిగా అభినందిస్తున్నాను.

మీ సామర్ధ్యాన్ని గురించి పెద్దలందరూ మాట్లాడారు. చాలా కాలంగా మీతో కలసి పనిచేసే అవకాశం కలిగిన వారిలో నేను కూడా ఒకడిని. ప్రదేశ్ కాంగ్రెస్‌లో వివిధ పదవులు స్వీకరించి, హైకోర్టులో న్యాయవాదిగా బడుగు, బలహీనవర్గాల వారి కేసులను గట్టిగా వాదించి, వారికి న్యాయం చేకూర్చడానికి ప్రయత్నం చేశారు. లెజిస్లేటివ్ కౌన్సిల్ ఏర్పడినప్పటి నుంచి మాడ పాటి హనుమంతరావు గారు వంటి ఎందరో పెద్దలు చాలా ఆదర్శప్రాయంగా పనిచేసారు, వారి కోవలోనే మీరు కూడా కార్యక్రమాలు నడిపిస్తున్నారు. సభా నిర్వహణలో అప్పుడప్పుడు ఉద్రిక్తమైన పరిస్థితులు ఏర్పడుతూ వుంటాయి. అప్పుడు అధ్యక్షులు కటువుగా వ్యవహరించవలసిన సందర్భాలు ఏర్పడుతూ వుంటాయి. తమరు సభను ఎంతో హుందాగా నడిపిస్తూ, సభా గౌరవాన్ని ఇనుమడింపజేస్తూ వస్తున్నారు, చాలా సంతోషం . ఈ సభా గౌరవాన్ని ముందు ముందు మరింత పెంచాలని కోరుతున్నాను.

లెజిస్లేటివ్ కౌన్సిల్ మనకు అవసరమా కాదా అనే చర్చలు జరిగిన సందర్భాలు వున్నాయి. ఇప్పటికీ ఇది అవసరం లేదని వాదించే వారు కూడా లేకపోలేదు. కాని రెండవ సభ కూడా వుండాలని మనస్ఫూర్తిగా విశ్వసించిన వారిలో నేను ఒకరిని. 1985లో లెజిస్లేటివ్ కౌన్సిల్ ఈ రాష్ట్రంలో రద్దయిన తరువాత, దానిని పునరుద్ధరించే కార్యక్రమంలో స్వర్గీయ వై.ఎస్. రాజశేఖర రెడ్డి గారు చొరవ చూపించారు. అఖిల భారత కాంగ్రెస్ నాయకత్వం కూడా మనకు చాలా తోడ్పడ్డారు. ఆ సందర్భంలో మీరు చేసిన గణనీయమైన కృషి ప్రశంసనీయమైనది. మన మిత్రుడు సత్యనారాయణ రాజు గారు ఇక్కడ వుండేవారు. వారు కౌన్సిల్‌కు రాలేదు కాని, వారు, మీరు చేసిన కృషి నాకు బాగా తెలుసు. కేంద్ర ప్రభుత్వం యొక్క అనుమతి సంపాదించడంలో మీరు చేసిన కృషి, తీసుకున్న శ్రద్ధ తెలిసిన వారు ఎవరూ కూడా అభినందించకుండా వుండలేము కాబట్టి కౌన్సిల్ పునరుద్ధరణకు విపరీతంగా కృషి చేసి, కౌన్సిల్‌లో అర్ధవంతమైన చర్చలు జరిపించడానికి నిరంతరమూ, అహర్నిశలూ కృషి చేస్తున్న మీకు హృదయపూర్వకమైన అభినందనలు తెలియజేస్తున్నాను. మీ నేతృత్వంలో రాబోయే 6 సంవత్సరాల కాలంలో మన కౌన్సిల్ చాలా మంచి చర్చలకు నిలయంగా మారి, రాష్ట్రమే కాదు, రాష్ట్రేతరులు కూడా ఆంధ్రప్రదేశ్ లెజిస్లేటివ్ కౌన్సిల్‌లో చర్చలు సారవంతంగా వుంటాయి, అర్ధవంతంగా వుంటాయనే మాట చెప్పుకుంటుంటే వినే విధంగా మన కౌన్సిల్‌ను తీర్చిదిద్దేందుకు ప్రయత్నం చేయాలని కోరుతున్నాను.

ఈ సందర్భంగా ఒక విషయం గుర్తు చేయదలచుకున్నాను. గతంలో పుచ్చలపల్లి సుందరయ్య గారు, తరిమెల నాగిరెడ్డి గారు, తెన్నేటి విశ్వనాథం గారు వంటి నాయకులు అసెంబ్లీలో క్వశ్చన్ అవర్ ఐపోగానే కౌన్సిల్‌కు వచ్చి గ్యాలరీలో కూర్చుని ఇక్కడ ప్రొసీడింగ్స్ చూస్తూ వుండేవారు. నేను ఒకటి రెండు సందర్భాలలో వారిని అడిగితే కౌన్సిల్‌లో చర్చలు అర్ధవంతంగా వుంటాయి, బాగుంటాయి, లోయర్ హౌజ్ లో చర్చల కంటే బాగుంటాయి, అందుకే మేము అది కాగానే ఇక్కడకు వచ్చి కూర్చుంటామని చెప్పడం జరిగింది.

నేను ఒకటే చెబుతున్నాను, మనమందరమూ కలసి, సమిష్టి కృషి ద్వారా కౌన్సిల్ స్థాయిని, కౌన్సిల్‌లో చర్చల స్థాయిని పెంచి, మెరుగైన రీతిలో నడిపించే విధంగా చేయాలని కోరుతున్నాను. అట్లా కాకుండా ఆ సభలో ఏదో జరిగిపోతోంది, ఇక్కడేమీ లేదు, రేపు న్యూస్‌లో నా పేరు రాదేమోననే భావన లేకుండా మన గౌరవాన్ని, మన సభా గౌరవాన్ని పెంచే విధంగా ప్రవర్తించాలని కోరుతున్నాను. చక్రపాణి గారు రాబోయే 6 సంవత్సరాల కాలంలో అత్యంత ఫలప్రదమైన చర్చలను జయప్రదంగా జరిపించాలని కోరుకుంటూ సెలవు తీసుకుంటున్నాను.

డా. పి.వి. రంగారావు ( నామినేటెడ్ ) : అధ్యక్షా, విద్యార్థి దశ నుంచి మిమ్మల్ని గమనిస్తున్నాను. ముఖ్యమంత్రిగా దామోదరం సంజీవయ్య గారు వున్నప్పటి నుంచి, మీరు పార్టీకి, ప్రభుత్వానికీ చేస్తున్న సేవలు చాలా గొప్పవి, ప్రశంశనీయమైనవి. ఈ రోజు మీరు ఏకగ్రీవంగా ఎన్నిక కావడమనేది ఒక గొప్ప చారిత్రాతకమైన విషయంగా నేను భావిస్తున్నాను. మొట్టమొదటి కౌన్సిల్ ఛైర్మన్ మాడపాటి హనుమంతరావు గారు. వారి కుమారుడు నా క్లాస్‌మేట్. అట్లాగే ముఖస్సిర్‌షా గారు కూడా రెండు సార్లు ఈ కౌన్సిల్‌కు ఛైర్మన్ అయ్యారు. వారి అడుగుజాడలలో నడిచి మీరు చరిత్ర సృష్టిస్తున్నందుకు మనస్ఫూర్తిగా మిమ్మల్ని అభినందిస్తున్నాను. ఈ రోజు సభను చూస్తుంటే నాకు చాలా అనందంగా వుంది. ఈ సభ రద్దుకావడానికి కారణం రోశయ్య గారిని చూసి భయపడి ఒక పెద్ద మనిషి ఈ సభను రద్దు చేసారు ప్రత్యక్షంగా. పరోక్షంగా ఈ సభ రావడానికి మీరు కారకులయ్యారు. మీరు చేసిన అజ్ఞాత కృషి బహుదా ప్రశంసనీయం .

There are no short-cuts to success. It is a constant and determined effort, that lays down all resistance and sweeps away all obstacles. It is said by Lord Bristol. జీవితంలో ఒక్క క్షణంలోనే విజయం రాదు. అనేక ఆటంకాలను, అడ్డంకులను తొలగించుకుని, అపజయాలను విజయాలుగా మార్చుకున్నపుడే ఒక విజయాన్ని సాధించుకోడానికి అవకాశం వుంటుంది.

సా. 04.50

మీరు జీవితంలో ఎంతో కష్టపడ్డారు. మీ కుటుంబంతో నాకున్నటువంటి సన్నిహిత సంబంధం వల్ల, ఉద్యమాల సమయంలో కానీ, ప్రభుత్వం ఒక క్రైసిస్‌లో ఉన్నప్పుడు మీరు ఏ విధంగా కాపాడేవారో, మా నాన్నగారు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు మీరు ఏ విధంగా సహకరించారో అవి జ్ఞాపకం చేసుకుంటే, బహుశా మా నాన్నగారి ఆత్మ కూడా సంతోషిస్తుందని నేను భావిస్తున్నాను. "అయం నిరః, పరో వ్యక్తి జగనాం, లఘు చేతనాం, ఉదార చేతానాంతు, వసుధైక కుటుంబః" అన్నారు. మీలో కుల, మత ద్వేషాలు, ప్రాంతీయ భేదాలు లేవు. అందరినీ సమానంగా చూసే ఘనత ఉంది కనుక, వారందరినీ అలాగే చూశారు. చాలాసార్లు బయట మామూలు మనుషులకు ఆగ్రహం చాలా అపహాస్యం కలిగిస్తుంది. కానీ, మీ ఆగ్రహం మీకొక అలంకార ప్రాయం. మీకు అది ఒక ఆయుధం. కట్టుతప్పుతున్న సభ్యులను అదుపు చేయడానికి అద్భుతంగా మీరు అప్పుడప్పుడు ప్రయోగించే ఆగ్రహం అది. ఆ ఆగ్రహం మనస్ఫూర్తిగా వచ్చేది కాదు. మాకు చూపించేది మాత్రమే. ఇది కేవలం అందరినీ అదుపులోకి తీసుకువచ్చేదేనని మేము భావిస్తూన్నాము. మీరు ఆరు సంవత్సరాల పాటు ఈ సభను సమర్థవంతంగా నడుపుతారని మాకు నమ్మకం ఉన్నది. ఎందుచేతనంటే మీరు అనేక విషయాలలో నిష్ణాతులు. శాసన సభలో ఎలా, ఏవిధంగా నడపాలో, ఎవరికి ఎంత సమయం ఇవ్వాలో మీ సమయోచిత జ్ఞానం, విజ్ఞత మాకు అనేకసార్లు సభలో నిదర్శనాలయ్యాయి. కనుక మిమ్మల్ని రెండవసారి మాకు అధ్యక్షుడిగా అందించినందుకు ముఖ్యమంత్రిగారికి, అందుకు సహకరించిన ఇతర పెద్దలందరికీ నా హృదయపూర్వకమైన

అభినందనలు తెలియజేస్తూ, మీ ఆరు సంవత్సరాల కాలం సుసంపన్నంగా, చరిత్రాత్మకంగా, అద్భుతంగా, అత్యంత ప్రశంసనీయంగా సాగాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ ఎస్. ఇంద్రసేన్ రెడ్డి (శాసనసభ): అధ్యక్షా, గౌరవనీయులైన ఛైర్మన్‌గారికి, సభలోని వారికి నా హృదయపూర్వక నమస్కారాలు. నాకు చక్రపాణికి ఉన్న సంబంధం ఆయన అన్నలాగా, నేను తమ్ముడిలాగా ఉన్నాము, ఇది మీ అందరికీ తెలిసిన విషయమే. కాంగ్రెస్ పార్టీలో దామోదరం సంజీవయ్యగారు ఉన్నప్పటి నుంచి నేను యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీగా ఉండి, వెంగళరావు గారు ఉన్న సమయంలో మీరు ప్రెసిడెంటుగా ఉన్నప్పుడు కూడా మన రాష్ట్రంలో రాష్ట్రపతిపాలన ఉన్నది. ఆ సమయంలో కూడా మేమంతా కూడా చాలా కష్టపడి పనిచేశాము. అప్పుడే ఆయన దగ్గర నుంచి మేము నాయకత్వ లక్షణాలను నేర్చుకున్నాము. ఈ నాడు మన ఛైర్మన్‌గా చక్రపాణి గారిని ఎన్నుకునే సమయంలో ఇంకా అనేక సంగతులు జరిగినా, కేవలం ముఖ్యమంత్రిగారి చొరవవలనే ఇది జరిగిందని తెలియజేస్తూ ఆయనని అభినందిస్తున్నాను. ఇక ఇంతకన్నా నేను చెప్పేదేమి లేదు.

శ్రీ రుద్రరాజు పద్మరాజు (తూర్పుగోదావరి) : అధ్యక్షా, ఈ రోజు రాష్ట్ర శాసన మండలికి మీరు అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎంపికైన సందర్భంగా నా హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తున్నాను. మీతో, మాకు సుమారుగా రెండున్నర దశాబ్దాల అత్యంత సన్నిహిత సంబంధాలున్నాయి. మేము యువజన కాంగ్రెస్‌లో ఉండగా మీరు ప్రధాన కార్యదర్శిగా ఉన్నప్పుడు మీరు వెంగళరావుగారి నాయకత్వంలో ఎంతో చిత్తశుద్ధి, అంకిత భావంతో పనిచేశారు. ఆనాటి నుంచి, ఈనాటి వరకూ మీలో ఉన్నటువంటి ఆ నిరాడంబరత కానీ, ప్రేమ, ఆప్యాయతలు చూసి మేమెప్పుడూ మురిసిపోతూ ఉంటాము. గత నాలుగు సంవత్సరాల నుండి శాసన మండలి అధ్యక్షులుగా మీరు నిర్వహించిన బాధ్యతలు చూసినప్పుడు మేమంతా యువకులుగా శాసన మండలిలో ప్రవేశించిన నాటి నుంచి మీరు మాకు ఇచ్చిన తర్ఫీదు గానీ, మాకు ఇచ్చిన అవకాశాల వలన మేము ఒక చక్కని మార్గ నిర్దేశకత్వంలో ఈ స్థాయికి ఎదిగామని మనవి చేస్తున్నాను. మీరు విద్యార్థి నాయకుడిగా ఉస్మానియా విశ్వవిద్యాలయంలో లా గ్రాడ్యుయేషన్ చేస్తున్నప్పుడు లా కాలేజీకి సంబంధించి అధ్యక్షుడిగా ఎన్నికై, ఆనాడే బీజం వేశారు. ఆనాడు విద్యార్థి నాయకుడిగా, శాసన మండలిలో 1979వ సంవత్సరంలో ప్రప్రథమంగా అడుగుపెట్టినప్పటినుంచీ అంచెలంచెలుగా మీరు ఎదుగుతున్న తీరు చూసినట్లయితే చాలా ఆనందంగా ఉంది. మీతో సన్నిహిత సంబంధాలు కలిగినటువంటి పెద్ద పెద్ద వ్యక్తులు కూడా ఎప్పుడూ వేనోళ్ల పొగుడుతున్న సందర్భాలు చూసినప్పుడు మేమెంతో గర్వపడేవాళ్ళం. ఈ నాలుగు సంవత్సరాలలో చూసినట్లయితే కొత్తగా వచ్చిన శాసన మండలికి యువకులు ఎక్కువగా ఉన్నారు. మా అందరికీ తర్ఫీదునిచ్చిన వ్యక్తి మీరు. మీకున్నటువంటి ఆ అనుభవాన్ని రంగరించి అన్ని విషయాలను వివరించి చెప్పటంలో కానీ, మాకు సభలో ఎక్కువగా అవకాశాలు, సమయం ఇచ్చి ఏవిధంగా ఉండాలో చెప్పిన వ్యక్తి మీరు. అటువంటి మీకు ఎప్పుడూ కూడా ఋణపడి ఉంటామని మనవి చేస్తున్నాను. అంతేగాకుండా ఒక హైకోర్టు లాయరుగా మీరు చేసిన కృషి , అంకిత భావంతో పనిచేసి మంచి పేరు ప్రతిష్టలు తెచ్చుకున్న మీరు ఎంతో ప్రశంసనీయులు. అతి చిన్న కుటుంబం నుంచి అంచె లంచెలుగా ఎదిగిన మీరు అతి నిరాడంబరతతో కూడిన అణకువతో మెలకువలు అన్నీ తెలుసుకోవడం ద్వారా మీరు పెద్దలందరి హృదయాలను ఆకర్షించిన వ్యక్తిగా మిమ్మల్ని అభినందిస్తున్నాను. రాష్ట్రంలోని దళితులు, షెడ్యూల్డు కులాలు, తెగలకు సంబంధించిన సహకార సంఘాల వారితో కూడా మీరు పాలుపంచుకున్నారని మేము విన్నాము. వారందరి అభివృద్ధి, సంక్షేమం కోసం అహర్నిశలు తపించే మీరు శాసన మండలిలో ఉన్నతమైన ఈ అధ్యక్ష స్థానాన్ని రెండవసారి కూడా

అధిరోహించడం, దీనికి రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ ఎన్. కిరణ్ కుమార్ రెడ్డి సహకారం మరియు అఖిల భారత కాంగ్రెస్ అధ్యక్షురాలైన సోనియా గాంధీ గారు గానీ, ఇతర పెద్దలందరి ఆశీస్సులతో ఈ పదవిని అలంకరించడం మాకు చాలా ఆనందంగా ఉంది. గతంలోకి ఒకసారి వెళ్ళినట్లయితే, నాడు అఖిల భారత కాంగ్రెస్ పార్టీలో అధ్యక్షులుగా ఉన్న దళిత ముఖ్యమంత్రి శ్రీ సంజీవయ్యగారికి మీరు అత్యంత సన్నిహితంగా మెలిగి, ఆయన అడుగుజాడలలో నడిచి, ఆయన మెప్పు పొంది, మీరు ఈ స్థాయికి రావడం ఎంతో అభినందనీయమని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను. 1972వ సంవత్సరంలో నాడు కాంగ్రెస్ పార్టీకి సంబంధించి ఒక హై పవర్ కమిటీని 12 మంది సభ్యులతో ఏర్పాటు చేసినప్పుడు మీరు కూడా సభ్యులుగా ఉన్నారు. అతి చిన్న వయస్సులోనే మీకు అవకాశం కల్పించిన పార్టీకి ఎప్పుడూ కూడా పార్టీవైపే ఉన్నారని ప్రత్యేకంగా తెలియజేస్తున్నాను. పి.సి.సి.లో ప్రధాన కార్యదర్శిగా, ఉపాధ్యక్షుడిగా గానీ అనేకమైన ఉన్నత పదవులు అలంకరించిన మీతో మాకు అనేక సంవత్సరాలుగా సంబంధం ఉంది. అంతేగాకుండా, గత నాలుగు సంవత్సరాలుగా ఛైర్మన్‌గా ఉంటూ, వివిధ రాష్ట్రాలలో పర్యటనలు చేసినప్పుడు ఆ కమిటీలలో మీతోపాటు కలసి పనిచేసినప్పుడు మాకు మధురానుభూతులు కలిగాయని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను. ఇటువంటి పరిస్థితులలో రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తూ అనేక క్లిష్ట పరిస్థితులలో కూడా సమర్థవంతంగా పనిచేసి మంచి పేరు తెచ్చుకున్నారు. అవి మీ కీర్తికి మరింత వన్నె కలిగే విధంగా దోహదం చేశాయని తెలియజేస్తున్నాను. మీరు కాన్‌స్టిట్యూషన్ లా లో ప్రత్యేకంగా పి.హెచ్.డి. చేయడం, ఒక న్యాయ కోవిదుడిగా కేవలం మన రాష్ట్రంలోనే కాదు, యావత్ భారత దేశంలో ఉన్నటువంటి అనేకమైన రాజకీయవేత్తలతోపాటు, న్యాయ శాస్త్రకోవిదులతో కూడా సన్నిహిత సంబంధాలుండడం మేము చూశాము. అదేవిధంగా వివిధ కమిటీలతో ఢిల్లీలో మీతోపాటు మేము పర్యటించినప్పుడు మీకు ఉన్న అవగాహన తీరు మమ్మల్ని మంత్రముగ్ధుల్ని చేశాయని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను. ఈ రోజు మరొకసారి మీరు శాసన మండలి అధ్యక్షునిగా తిరిగి ఎన్ని కైనందుకు మాకు చాలా ఆనందంగా ఉంది. రాబోయే రోజులలో మనందరికీ కూడా మరొకసారి సమ న్యాయం పాటిస్తూ, క్రొత్తగా వచ్చిన సభ్యులందరినీ దృష్టిలో పెట్టుకుని, వారికి కూడా మంచి అవకాశాలు ఇవ్వాలని, తద్వారా మీ అపూర్వ, అపారమైన అనుభవాన్ని మా అందరికీ పంచుతూ, మాకు మార్గనిర్దేశకత్వం వహించాలని విజ్ఞప్తి చేస్తున్నాను. అధ్యక్షునిగా ఎన్నికైనందుకు మరొకసారి హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తూ సెలవు తీసుకుంటున్నాను. థ్యాంక్యూ.

సా.5.00

శ్రీ బి. చంగల్ రాయుడు (కడప) : అధ్యక్షా, శాసన మండలి అధ్యక్షునిగా రెండవసారి ఏకగ్రీవంగా ఎన్నిక కాబడినందుకు మీకు శుభాకాంక్షలు తెలియజేసుకుంటున్నాను. పెద్దలు, గౌరవనీయులైన రోశయ్య గారు చెప్పినట్లు.. శాసన మండలి యొక్క ఔన్నత్యాన్ని నిలబెట్టే దానికి మీరు చేస్తున కృషిని అభినందించడానికి ముందుగా, మిమ్ములను అధ్యక్షునిగా రెండవసారి ఎంపిక చేసుకోవడానికి చొరవ తీసుకున్న గౌరవ ముఖ్యమంత్రి శ్రీ యన్. కిరణ్‌కుమార్ రెడ్డి గారికి ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. మీరు శాసన మండలి అధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నిక అయ్యేందుకు ఇక్కడ సహకరించిన పెద్దలు శ్రీ దాడి వీరభద్రరావు గారికి, ఇతర ప్రతిపక్షనేతలందరికీ మరొకసారి ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నాను. ఈ సందర్భంగా అందరూ చెప్పిన విషయాలతో నేను కూడా పూర్తిగా ఏకీభవిస్తున్నాను. తరువాత, మన రూల్సు బుక్‌లో కొన్ని అంశాలు ఔట్ డేటెడ్‌గా ఉన్నాయి కాబట్టి, వాటిని అప్‌డేట్ చేయడమో లేక సవరించడమో చేయాల్సిన అవసరం ఉంది. రూల్సు బుక్‌ను అప్‌డేట్ చేస్తే కాని సభ్యులకు కొంత క్లారిటీ రాదు కాబట్టి అప్‌డేట్ చేసేందుకు

అవసరమైన స్టడీ కోసం ఎక్కువ శ్రద్ధ చూపించాలని కోరుతున్నాను. రెండవసారి మీరు ఛైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైనందుకు మరొకసారి అందరి తరపున మీకు అభినందనలు తెలియజేస్తూ, నాకు ఈ అవకాశం కల్పించినందుకు ధన్యవాదాలు తెలుపుకుంటూ, సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ పొంగులేటి సుధాకర్ రెడ్డి (ఖమ్మం)ః అధ్యక్షా, రెండవ పర్యాయం ఆ ఉన్నత స్థానంలో మీరు కూర్చున్నందుకు శుభాభినందనలు తెలియజేస్తున్నాను. ఉగాది పచ్చడి లాగా తీపి, వగరు, పులుపు వంటి అన్ని రుచులను అందరికి చూపించే వ్యక్తిత్వం ఉన్నటువంటి మీరు, బహుముఖ ప్రజ్ఞాశాలిగా, డా. చక్రపాణిగా అందరికి సుపరిచితులుగా ఉన్న మీరు, ఈ పెద్దల సభకు గతంలో ఒక దిశ, దశను చూపించారు. ఎందుకంటె.. కేవలం తీపి మాత్రమే ఎక్కువ అయితే షుగర్ వచ్చే అవకాశం ఉంది కాబట్టి, ఆ విధంగా జరగకుండా మనందరికి మంచి చేయాలని ఆ భగవంతుని కోరుకుంటున్నాను. పెద్దల సభ అనే ఈ కుటుంబంలో కొత్తగా చేరిన 30 మంది సభ్యులకు కూడా అభినందనలు తెలియజేస్తున్నాను. శాసన మండలి ఛైర్మన్‌గా మంచి వ్యక్తిని ఎంపిక చేసినందుకు అఖిల భారత కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియా గాంధీ గారిని, ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డి గారిని, కాంగ్రెస్ పార్టీని ప్రతిపక్ష పార్టీ కూడా అభినందించింది. కాంగ్రెస్ పార్టీని అభినందించినందుకు ప్రతిపక్ష పార్టీని కూడా అభినందిస్తూ, మీకు మంచి జరగాలని కోరుకుంటూ, ముగిస్తున్నాను.

శ్రీ జి. తిప్పేస్వామి(అనంతపూర్) ః అధ్యక్షా, గత నాలుగు సంవత్సరాలు కూడా శాంతియుతంగా, చాకచక్యంగా ఈ సభ నడవడానికి చాలా చక్కగా మీరు పని చేశారు. మీ యొక్క శక్తిసామర్థ్యాలను, కలుపుగోలుతనాన్ని, మంచితనాన్ని గుర్తించి మన గౌరవ ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డి గారు, అధిష్టాన వర్గం మరల రెండవ సారి శాసన మండలి ఛైర్మన్‌గా ఎంపిక కావడానికి అవకాశం కల్పించినందుకు వారికి కూడా ధన్యవాదాలు తెలుపుకుంటున్నాను. ఏదేమైనా, మీ అనుభవమంత మా వయస్సు లేదు కాబట్టి మీ నుండి నేర్చుకోవాల్సిన విషయాలు చాలా ఉన్నాయి. సభలో ఒక ప్రక్కన గాంధీ భవన్ బ్యాచ్ ఉంటుంది. మరొక ప్రక్క ప్రతిపక్ష బ్యాచ్ ఉంటుంది. సభలో మాట్లాడడానికి వాళ్లకే ఎక్కువగా అవకాశం ఇస్తుంటారు. వారికే కాకుండా, ఎదురుగా కూర్చున్న మాలాంటి వారు మంచి విషయాలు తెలుసుకోవడానికి , సభలో మాట్లాడడానికి దయచేసి అవకాశం ఇవ్వవలసిందిగా ఈ సందర్భంగా సవినయంగా కోరుతూ, ఈ అవకాశం ఇచ్చిన మీకు ధన్యవాదాలు తెలుపుకుంటూ, సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ పి. నరేందర్ రెడ్డి (రంగారెడ్డి)ః అధ్యక్షా, శాసన మండలికి ఛైర్మన్‌గా రెండవ సారి ఏకగ్రీవంగా ఎన్నికైనందుకు ప్రత్యేకంగా మీకు శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను. అదే విధంగా, కొత్తగా వచ్చిన 30 మంది సభ్యులకు కూడా అభినందనలు తెలియజేస్తున్నాను. రెండవసారి మిమ్ములను శాసన మండలి అధ్యక్షునిగా ఎంపిక చేసినందుకు గౌరవ ముఖ్యమంత్రి శ్రీ యన్. కిరణ్‌కుమార్ రెడ్డి గారికి కూడా ధన్యవాదాలు తెలుపుకుంటున్నాను. ముఖ్యంగా, ఈ సభలో నేను మిమ్ములను గత సంవత్సరం నుండి చూస్తున్నాను. ఏ ఒక్క సభ్యుని కూడా నొప్పించకుండా అందరిని కలుపుకొని, అందరికీ అవకాశం ఇచ్చి, అందరి మెప్పును పొందే విధంగా సభను నడిపారు. గవర్నర్ కోటాలోని ఎం.ఎల్.సీల ఎంపికలో ఆలస్యం జరగడంతో మరల మీకు దానిలో స్థానం కల్పిస్తారా?లేదా? చైర్మన్‌గా మరల మిమ్ములను ఎన్నుకుంటారా? లేదా? అనే ప్రశ్నలతో, అనుమానాలతో కొంతమంది సభ్యులు ఆందోళన చెందిన మాట వాస్తవం. రెండవ సారి మీరు ఛైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైనందుకు మరొకసారి ధన్యవాదాలు తెలుపుకుంటూ, సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ వి. గంగాధర్ గౌడ్ (శాసనసభ) : అధ్యక్షా, రెండవ సారి శాసన మండలి ఛైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన పెద్దలు, గౌరవనీయులైన డా. చక్రపాణి గారికి అభినందనలు తెలియజేసుకుంటున్నాను. రెండవ సారి ఛైర్మన్‌గా ఎంపికైనటువంటి మీరు అపారమైన అనుభవమున్న వ్యక్తి. నేను దాదాపుగా 1974 వ సంవత్సరం నుండి రాజకీయాలలో ఉన్నాను. 2011 వ సంవత్సరం మార్చి, 17 వ తేదీన శాసన మండలికి జరిగిన ఎన్నికలలో కొత్తగా నేను సభ్యునిగా ఎన్నిక కాకముందే, మీ గురించి నాకు తెలుసు. కొత్తగా వచ్చిన దాదాపు 30 మంది సభ్యులలో ఐదారుగురు తప్ప మిగతా వారంతా శాసన మండలిలో కొత్తగా సభ్యత్వం పొందిన వారే. నేను సహకార రంగం నుండి వచ్చిన వాడిని. శాసన మండలి అంటే పెద్దల సభ. పెద్దల సభకు అధిపతిగా మీరు రెండవ సారి ఎన్నికైన సందర్భంగా, ఏ విధంగా అయితే శాసన సభలో సంవత్సరానికి వంద రోజులు సమావేశాలు జరుగుతాయో అదే విధంగా, శాసన సభతో సమానంగా శాసన మండలిని కూడా నడిపించే పరిస్థితిని తీసుకురావాలని కోరుతున్నాను. ప్రస్తుతం శాసన మండలి సంవత్సరానికి దాదాపు 50, 60 రోజులు మాత్రమే సమావేశం అవుతున్నట్లుగా నేను పత్రికల ద్వారా చూస్తున్నాను. అదే విధంగా, సమావేశాలు జరుగుతున్న సందర్భాలలో శాసన మండలికి కూడా గౌరవ ముఖ్యమంత్రి గారితో పాటు మంత్రులందరూ విధిగా హాజరు కావాలనీ, బడుగు, బలహీన దళితుల, మహిళల, మైనార్టీ వర్గాల అభివృద్ధికి, గ్రామాల అభివృద్ధికి, రైతాంగం అభివృద్ధికి కూడా సభలో చర్చ జరగాలని నూతనంగా వచ్చినటువంటి సభ్యులందరం ఆశిస్తున్నాం. నూతనంగా వచ్చిన సభ్యులకు కూడా సభలో తరచుగా మాట్లాడే అవకాశం ఇవ్వాలని కోరుతున్నాను. ఎందుకంటే .. జిల్లాల పరిస్థితిని, జిల్లాలలో ఉన్న సమస్యలను, అభివృద్ధి కార్యక్రమాల గురించి కొత్తగా వచ్చిన సభ్యులు సభలో తప్పకుండా ప్రస్తావిస్తారనే ఆశతో రాష్ట్ర ప్రజలు ఉంటారు కాబట్టి నూతనంగా వచ్చిన సభ్యులకు కూడా తప్పకుండా అవకాశం ఇవ్వాలని కోరుతున్నాను. ఆ విధంగా మీరు అవకాశం ఇస్తారనే నమ్మకం మాకు ఉంది. రెండవ సారి శాసన మండలి ఛైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైనటువంటి మీకు మా పార్టీ తరపున మరొకసారి అభినందనలు తెలియజేసుకుంటూ, సెలవు తీసుకుంటున్నాను.

డా. కె. నాగేశ్వర్ ( మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ ) : అధ్యక్షా, శాసన మండలి సభ్యుడుగా, సభాపతిగా రెండింటికి రెండవ పర్యాయం ఎన్నికైనందుకు మీకు డబుల్ ధన్యవాదాలు తెలియజేసుకుంటూ, శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను. మీకైనా, మాకైనా మొదటి ఇన్నింగ్స్ ఒక పరీక్ష లాంటిది. ఈ సమయంలో మీరు శాసన మండలికి ప్రతీకగా పని చేశారు. రాష్ట్రంలో చాలా ప్రాంతాలకు వెళ్లినప్పుడు నేను శాసన మండలి సభ్యుడునని అంటే, మొదటిగా వారు మీ ఛైర్మన్ చక్రపాణి గారు కదా అని అంటారు. సభకు విజిబిలిటి లేకపోయినా డా. చక్రపాణి గారి గురించి ఎందుకు ఇంత విజిబిలిటి వచ్చిందనే అనుమానం నాకు అప్పుడప్పుడు వచ్చేది. ఇది వాస్తవం. అందువల్ల , మీ నాయకత్వంలో మేము పని చేసినందుకు..

మిస్టర్ ఛైర్మన్ : అది సమష్టి కృషి నాగేశ్వర్ గారూ.

డా. కె. నాగేశ్వర్. : అధ్యక్షా, మీ నాయకత్వంలో సమష్టి కృషి జరిగినందుకు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నాను. పబ్లిక్ పొజిషన్స్‌లో ఉన్న చాలా మంది వ్యక్తులు చాలా సందర్భాలలో వ్యక్తిగత జీవితానికి, ప్రజా జీవితానికి మధ్యన ఉన్నటువంటి అతి సున్నితమైన హద్దులను పాటించరు. అటువంటి హద్దులను మీరు పాటిస్తున్నట్లు నేను గమనించాను. సభలో ఉన్నప్పుడు మీరు ఛైర్మన్. సభ వెలుపల ఉన్నప్పుడు మీరు

డా. చక్రపాణి గారు. ఈ విధంగా తేడా ఉండడమనేది చాలా సంతోషించాల్సిన విషయం. ఈ సభలో గతంలో మేము మీతో అనేక సందర్భాలలో ఘర్షణ పడ్డాం. భవిష్యత్తులో కూడా పడతాం. సభను సజావుగా జరిపించాలన్న మీ తపన, సభలో ప్రజా సమస్యలను సమర్ధవంతంగా లేవనెత్తాలన్న మా తపన మధ్య జరిగే అనివార్య ఘర్షణే తప్ప మరేమి కాదు. మీకు మా పట్ల వ్యక్తిగతంగా అగౌరవ భావం ఉందని మేము అనుకోం. అలాగే, మీ పట్ల మాకు వ్యక్తిగతంగా అగౌరవం ఉండే అవకాశమే లేదు. అందువల్ల, ఈ రెండవ ఇన్నింగ్స్‌లో కూడా మా సహాయ, సహకారాలు మీకు ఎల్లప్పుడూ ఉంటాయి. మీరు గమనిస్తే.. ఛైర్మన్‌గా మద్దతు తెలుపుతూ ప్రతిపాదించిన వారిలో పిడిఎఫ్ సభ్యులం కూడా ఉన్నాం. It was a conscious decision of the PDF. సభలో ఎనిమిది మంది పిడిఎఫ్ సభ్యులం ఉన్నాం. మీకు మద్దతు ఇవ్వాలని ఎందుకు అనుకున్నామంటే.. డా. చక్రపాణి గారు సభాపతిగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్ధిగా తిరిగి పోటీ చేస్తున్నారని అనుకోలేదు. నాలుగు సంవత్సరాల పాటు సభాపతిగా ఉన్న డా. చక్రపాణి గారు మరల సభాపతిగా పోటీ చేస్తున్నారనుకున్నాం. పార్టీలకతీతంగా అందరూ మద్దతు ఇచ్చారు. తెలుగుదేశం కూడా మద్దతు ఇచ్చిందనుకుంటున్నాం. పోటీ పెట్టకపోవడమంటే మద్దతు ఇచ్చినట్లే. అంతేకాని, వేరే తేడా ఏమీ లేదు. రాష్ట్ర రాజకీయం ఈ పరిస్థితులలో ఉన్నప్పుడు కూడా రెండవసారి ఛైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నిక కావడమనేది తప్పకుండా అభినందించదగిన విషయం. రెండు సభలకు ఒకేసారి అధ్యక్ష పదవులకు ఎన్నిక జరిగిందని గౌరవనీయ ముఖ్యమంత్రి గారు అన్నారు. కాని, రెండు సభల అధ్యక్షుల ఎన్నికలలో గణనీయమైన తేడా ఉంది.

5.10 PM

కాని రెండు సభల అధ్యక్ష ఎన్నికలలో గణనీయమైన తేడా ఉంది. పెద్దలు రోశయ్యగారు చెప్పినట్లుగా శాసనసభ ఎజెండా ప్రభావం శాసనమండలిపై చాలా ఎక్కువగా పడుతుందనేది మా ఆవేదన, పడకూడదని నేను అనడం లేదు. అదే జరిగితే శాసనసభ ఉండగా శాసనమండలి ఎందుకనే ప్రశ్న ఈ రోజు కాకపోయినా రేపు ఎప్పుడైనా ఉదయిస్తుంది. అప్పుడు శాసనమండలి అస్థిత్వానికి ప్రమాదం వస్తుంది. శాసనసభ ఎజెండాకు భిన్నముగా సమస్యల అధ్యయనంలో పరిశోధనాత్మకంగా చర్చించే విధానం ఉంది. మీ నాయకత్వంలో శాసనమండలిని రెండవ ఇన్నింగ్సులో మరింత సమర్ధవంతంగా రూపు దిద్దాలని మా కోరిక. అలాగే ఎన్ని రాజకీయ విభేదాలున్నా క్వశ్చన్ అవర్ కంప్లీట్ అయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నాము. క్వశ్చన్ అవర్ అయిన తరువాత ఏదైనా చేద్దామనే సత్‌సాంప్రదాయాన్ని రెండవ ఇన్నింగ్సులో చేద్దాము. ఫస్ట్ ఇన్నింగ్సులో అనివార్య కారణాల వల్ల కొన్నిసార్లు జరగలేదు. మీ నాయకత్వంలో భావి తరాలకు శాసనమండలి కార్యకలాపాలను మరింత సమర్ధవంతంగా నిర్వహించేందుకు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ద్వారా శాసనమండలి వ్యవహారాలు ప్రవేశ పెట్టాలని కోరుతున్నాను. ఈ రోజు అడ్జర్న్‌మెంట్ మోషన్ ఇవ్వాలన్నా, క్వశ్చన్ పంపాలన్నా ఈ ఇన్ఫర్మేషన్ ఏజ్‌లో ఉదయం 8.30 గంటలకు ముందు కాగితం తెచ్చి ఇవ్వాలి. ఆ అవసరం ఉందా? ఒక ప్రశ్న మీకు ఇచ్చిన తరువాత వెంటనే సెక్రటేరియట్‌కు పంపి సమాధానం తెచ్చే వరకు ఆలస్యం అవుతుంది. అందువల్ల మీ నాయకత్వంలో వంద శాతం ఇ – లెజిస్లేచర్‌గా రూపు దిద్దుకోవాలని ఆకాంక్షిస్తున్నాము. దానికి సంబంధించి పూర్తి సహాయసహకారాలు అందిస్తాము. భవిష్యత్తులో మీ నాయకత్వంలో మరింత సమర్ధవంతంగా పని చేయాలని కోరుతూ, ప్రజా సమస్యలను లేవనెత్తడంలో మాకున్న తపనను, మాకున్న అవకాశాలను అర్ధం చేసుకుంటారని కోరుకుంటూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ కె.ఎస్.లక్ష్మణరావు (కృష్ణా, గుంటూరు)ః అధ్యక్షా, ఈ సభకు గత నాలుగు సంవత్సరాలుగా తమరు ఛైర్మన్‌గా వ్యవహరిస్తూ సభను సమర్థవంతంగా నిర్వహించారు. రెండవసారి కూడా ఛైర్మన్‌గా ఎన్నిక అయినందుకు నా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియచేస్తున్నాను. మీరు వ్రాసిన సెకండ్ ఛాంబర్స్ పుస్తకాన్ని నేను పూర్తిగా చదివాను. ఆ పుస్తకం ద్వారా పెద్దల సభ మీద మీకు ఎంత ప్రేమ, గౌరవం ఉందో అర్థం అయింది. నాలుగు సంవత్సరాల ముందు ఈ సభలో మేము అడుగుపెట్టినప్పుడు మాకు ఏమి తెలియదు. అంతకుముందు రాజకీయాలతో పెద్దగా పరిచయం లేదు. మేము, మీ నాయకత్వంలో అనేక విషయాలు నేర్చుకున్నాము. ప్రశ్నోత్తరాల సమయంలో ఎలా ఉండాలి, లఘు అంశాల మీద చర్చ జరిగేటప్పుడు ఎలా ఉండాలి అనే వాటి గురించి మీ దగ్గర చాలా నేర్చుకున్నాము. మీరు భవిష్యత్తులో కూడా మాకు అంటే బ్యాక్ బెంచెస్‌లో కూర్చునే వారికి అవకాశాలు ఇవ్వాలని కోరుతున్నాము. మీ నాయకత్వంలో సమర్థవంతంగా ప్రజా సమస్యలు చర్చించే విధంగా ఈ సభను కొనసాగించాలని కోరుకుంటూ, మీకు మరొక సారి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియచేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ పి. శంకర్‌రావు (మల్కాజ్‌గిరి)ః అధ్యక్షా, ఈ రోజు చాలా హిస్టారిక్ డే. కౌన్సిల్ సభ్యులందరికీ హృదయపూర్వక అభినందనలు. మేడమ్ సోనియా గాంధీగారు, ముఖ్యమంత్రిగారు మిమ్ములను మరొక్కసారి ఛైర్మన్‌గా ఎన్నిక చేయడం జరిగింది. సభలో ఉన్న తొంబైమంది ఏకగ్రీవంగా మిమ్ములను మరొకసారి ఛైర్మన్‌గా ఎన్నుకున్నారు. ప్రజల సమస్యలను పరిష్కారం చేయడంలో ప్రభుత్వంతోపాటు, మీరు అన్ని విధాల వాటిని చర్చించడానికి సభ్యులకు అవకాశం ఇచ్చి ప్రజాసమస్యలు తీర్చడానికి కృషి చేశారు. కౌన్సిల్‌లో మీరు హెడ్‌మాస్టర్‌లాగా, సభ్యులంతా పిల్లలలాగా చాలా హుందాగా వ్యవహరిస్తారు. అసెంబ్లీకి, కౌన్సిల్‌కు చాలా తేడా ఉంది. అసెంబ్లీలోఎప్పుడూ అడ్జర్న్‌మెంట్సే, 45 రోజుల సెషన్‌లో హార్డ్లీ ఒక వారం పది రోజులు మాత్రమే సభ జరుగుతుంది. అదే కౌన్సిల్‌లో హుందాగా అందరికీ అవకాశం వచ్చే విధంగా ఎవరికీ ఎటువంటి గ్రీవెన్స్ లేకుండా ప్రజల సమస్యలు పరిష్కారం అయ్యే విధంగా చర్చ జరుగుతుంది. ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా ప్రజలలో కూడా ఈ విధమైన అభిప్రాయమే ఉంది. మీరు ఛైర్మన్‌గా ఉండి సభను ఇంత హుందాగా నిర్వహిస్తున్నందుకు ధన్యవాదాలు తెలియచేస్తున్నాను. ఛైర్మన్‌గా మీరు సెకండ్ టెన్యూర్ సక్సెస్‌ఫుల్‌గా చేయాలని, ఆయురారోగ్యాలు కలగాలని కోరుకుంటూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీమతి డి.కె.అరుణ (గద్వాల)ః అధ్యక్షా, పెద్దలు, గౌరవనీయులు శ్రీ చక్రపాణిగారు రెండవ సారి ఛైర్మన్‌గా ఎంపిక అయిన సందర్భంలో నా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియచేస్తున్నాను. దాదాపు 13 సంవత్సరాలుగా ఇప్పటికి నాలుగవ టర్మ్ ఎమ్ఎల్‌సిగా, రెండవసారి కౌన్సిల్ ఛైర్మన్‌గా ఎంపిక అయ్యారు. గత నాలుగు సంవత్సరాలుగా పెద్దలసభకు ఛైర్మన్‌గా వ్యవహరించారు. ఈ సభలో ఏ చర్చ జరిగినా ఆ చర్చ అర్థవంతంగా, పెద్దల సభకు గౌరవాన్ని తెచ్చే విధంగా ఉండేది. గత రెండు సంవత్సరాలుగా అసెంబ్లీ సమావేశాలు అడ్జర్న్ అయిన వెంటనే ఈ సభలో కూర్చోవడం జరిగింది. ఆ సమయంలో అనేక అంశాల మీద చర్చ జరిగినప్పుడు, నేను ఎన్నో విషయాలు నేర్చుకోవడం జరిగిందని తెలియచేస్తున్నాను. మిమ్ములను ఏకగ్రీవంగా ఎంపిక చేసినందుకు ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు. ప్రతి ఒక్కరికి మిమ్ములను మరల ఆ కుర్చీలో చూడాలనే అభిలాష ఉందని తెలియచేస్తున్నాను. మీలో ఉన్న సమర్థతను గుర్తించి కాంగ్రెస్ పార్టీ ఎమ్ఎల్‌సిగా ఎంపిక చేసిందని భావిస్తున్నాము. మానాన్నగారితో మీకున్న సాన్నిహిత్యం వల్ల, మీరు నాతో ఆప్యాయంగా మాట్లాడేవారు. గాంధీభవన్‌లో మీరు పిసిసి వైస్ ప్రెసిడెంట్‌గా ఉన్నప్పుడు మమ్ములను మీరెంతో ఆప్యాయంగా పలకరించి,

ఎంకరేజ్ చేయడం జరిగింది. రెండవ సారి కౌన్సిల్ ఛైర్మన్‌గా ఎన్నికైనందుకు మా హృదయపూర్వక శుభా కాంక్షలు తెలియచేస్తున్నాను.

శ్రీ మహమ్మద్ జానీ (గుంటూరు): అధ్యక్షా, మీరు యునానిమస్‌గా ఎన్నిక అయ్యారు. మీతో పాటు, నేను కూడా నాలుగు సంవత్సరాలు కౌన్సిల్ సభ్యునిగా ఉన్నాను. ఈసభలో మీరు కౌన్సిల్ ఛైర్మన్‌గా, నేను డిప్యూటీ ఛైర్మన్‌గా పని చేశాము. మీరు కౌన్సిల్ ఛైర్మన్‌గా చాలా సేవలందించారు. సభ ఉన్నతికి, ఔన్నత్యా నికి మీరు బాగా కష్టపడ్డారు. మీతో పాటు డిప్యూటీ ఛైర్మన్‌గా నేను కూడా కష్టపడ్డాను. అలాగే రాబోయే సంవత్సరాలలో సత్ సాంప్రదాయాలు సభలో కొనసాగాలి. పెన్ను, పెన్సిల్, కాగితం ఏది కావాలన్నా అసెంబ్లీ మీద ఆధారపడవలసి ఉంది. ఆ సాంప్రదాయాన్ని మార్చండి. ప్రతి దానికోసం అసెంబ్లీకి వెళ్లే విధానాన్ని మార్చండి. అసెంబ్లీ బడ్జెట్ వేరు. కౌన్సిల్ బడ్జెట్ వేరుగా చేయండి. ఆ విధంగా ముందుకు పోవాలని, సభ యొక్క ఔన్నత్యం పెంచే విధంగా కృషి చేయాలని చెబుతూ ధన్యవాదాలు తెలియచేస్తున్నాను.

సా. 5.20

శ్రీ పాలడుగు వెంకట్రావు (కృష్ణా): అధ్యక్షా, ముందుగా అనేకమంది మిత్రులు కొత్తగా ఎన్నికై ఈ సభకు వచ్చిన సందర్భంలో వారికి హృదయపూర్వక ఆహ్వానం పలుకుతున్నాను. ఇంతకుముందు అనేకమంది సభ్యులు ఛైర్మన్‌గారి గురించి అభినందిస్తూ మాట్లాడారు, అందులో సగ భాగం ముఖ్యమంత్రిగారికి చెందుతాయని నా నమ్మకం. గత సమావేశాలలో ఛైర్మన్‌గారి పదవీ కాలం ముగిసిన సందర్భంలో వీరభద్రరావుగారు ఎందుకు మొదలు పెట్టారో తెలియదు గానీ ఛైర్మన్‌గారు చాలా బాగా చేశారని మొదలు పెట్టారు. అది అటు తిరిగి ఇటు తిరిగి వీడ్కోలు సమావేశంవలె నాకు అనిపించింది. ఆయన మళ్లీ ఇక ఛైర్మన్‌గా రారు అనేవిధంగా అందరూ మాట్లాడసాగారు. అప్పుడు నేను ఇదేమీ బాగాలేదు ఆయన మళ్లీ వస్తారు ఇది వీడ్కోలు చెబుతున్నట్లుగా ఉన్నది అని కూడా అన్నాను. అయితే, శ్రీ ఎన్. కిరణ్‌కుమార్ రెడ్డి లాంటి యువకులు అదేవిధంగా కాంగ్రెస్ చరిత్ర తెలిసిన నాయకులు మనకు ఉండగా చక్రపాణి గారి లాంటి పెద్దలకు అన్యాయం జరుగుతుందని నేను ఎప్పుడూ అనుకోలేదు. మొన్న ఢిల్లీలో అందరం కలిసి ఉన్నప్పుడే తమరికి ఆ సంకేతం వచ్చింది. కానీ, బయటకు వచ్చిన తరువాత మాతో మాట మాత్రం కూడా ఎవరూ చెప్పలేదు. మామూలుగా అందరితోపాటు టి.వి.లో చూసినప్పుడే తమరు ఎన్నికయ్యారని మాకు తెలిసింది. మీ మంచితనాన్ని పొగడాలంటే నాకు చాతకాదు. కానీ, ఒక్కమాట చెప్పదలచాను.

MR. CHAIRMAN : I want to disclose one thing. ముఖ్యమంత్రిగారు , మీరు నవ్వుతూ బయటకు వెళ్లండి అన్నారు. అదే నాకు ఇండికేషన్ అయింది. ఇంతవరకూ I kept it secret.

శ్రీ పాలడుగు వెంకట్రావు : నాకు కూడా అటువంటి సంకేతాలతోనే నన్ను ఢిల్లీ నుండి వెనక్కి రప్పించారు. ముఖ్యమంత్రిగారికి ఋణపడడం అనేటువంటి మాటలు నేను అనలేను గానీ, ఆయనను బలపరచడానికి, ప్రభుత్వం యొక్క స్థాయిని పెంచడానికి మనమందరం కలిసి కృషిచేయవలసిన అవసరం ఉన్నది. ముఖ్యమంత్రిగారు ఈ సభలో ఉన్నారు కాబట్టి ఒక మాట చెప్పదలచాను. ఎమ్ఎల్ఏలకు ఉన్నటువంటి గౌరవం ఎమ్ఎల్సీలకు ఉండడం లేదు. గౌరవం అంటే నా ఉద్దేశంలో వెనక పోలీసులు ఉండడం లేదా

సమావేశాలకు హాజరవడం వంటివి కాదు. రాష్ట్రం మొత్తం మీద ఉన్న ఎగ్జిక్యూటివ్ యంత్రాంగం అంటే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నుండి తహశీల్దారు దగ్గర ఉండే జవాను వరకూ మొత్తం అధికారులకు శాసనమండలి సభ్యులంటే ఒకవిధమైన 'రెస్పెక్ట్' ఉండాలి. ఇక్కడ 'రెస్పెక్ట్' అని కూడా నేను అనలేను. శాసన సభ సభ్యులపైన ఉన్న అభిప్రాయం, శాసనమండలి సభ్యులపైన లేదనేది నా ఉద్దేశం. ఆ విధంగా లేకపోవడానికి కారణం గతంలో వచ్చిన గ్యాప్ కావచ్చు, మీడియా కారణం కావచ్చు. కానీ, అది కూడా నేను చెప్పలేను. అధికార యంత్రాంగం పైనుండి కిందవరకూ కూడా ఎమ్ఎల్సీలకు, ఎమ్ఎల్ఏలతో సమానమైన రెస్పెక్ట్ లేదు. దీనిని ఏ విధంగా **restore** చేస్తారు? ఇది కేవలం ఏ ఒక్క రోజులోనో హుకుం జారీ చేస్తే జరిగే పని కాదు, నిత్యం పరిపాలనలో వచ్చే మాటలవల్ల జరగవలసి ఉంటుంది. తమరు వ్రాసిన 'సెకండ్ ఛాంబర్' పుస్తకం గురించి ఇంతకుముందు కొంతమంది గౌరవ సభ్యులు మాట్లాడారు. ముఖ్యంగా మన దేశంలో, మనం సభలో మాట్లాడుకునేటప్పుడు మనకు గౌరవం ఉందని అనుకుంటాము. ఉదాహరణకు, పార్లమెంట్‌లో ఉన్నవారందరూ అక్కడి వారందరికీ గౌరవం ఉందని, డా. మన్‌మోహన్‌సింగ్ అంటే గౌరవం ఉందని, మరో రాష్ట్ర అసెంబ్లీలో ఉంటే మాయావతి గారు గొప్పవారని, ఈ విధంగా ఎక్కడ ఉంటే అక్కడి వారు గొప్పవారని అనుకుంటాము. కానీ, ఏవిధంగా చూసినా అనుకుంటున్న 'రెస్పెక్ట్' లెజిస్లేచర్లకు నేడు లేదు. పూర్వం నెహ్రూగారి హయాంలో, ఇందిరాగాంధీగారి హయాంలో ఉన్నదానికంటే రానురాను తగ్గుతూ వస్తోంది. ఇందుకొరకు మన ప్రమాణాలను మనం పెంచుకోవాలి. ఇది కేవలం మన సభలో సభ్యులపైన, పరిపాలనపైన ఆధారపడి ఉన్నది. మన దేశం ప్రపంచం ముందు తలెత్తుకొని గర్వంగా నిలబడడానికి కారణం ఒక్క లెజిస్లేచర్ తప్ప మరొకటి కాదు. ఎగ్జిక్యూటివ్ కాపాడలేదు, జ్యుడీషియరీ మనలను కాపాడలేదు. ఎటు తిరిగినా ఈ దేశానికి మనమే ప్రతినిధులం కాబట్టి మన స్థాయిని మనం పెంచుకుని ప్రజలముందు ధైర్యంగా, నీతిమంతులుగా నిలబడే స్థాయి వచ్చినప్పుడు ఈ దేశం యొక్క ఐక్యత, గౌరవం నిలబడుతుందని మనవి చేస్తున్నాను. దానిని మీరు పెంచాలని, ప్రోది చేయ్యాలని ఆ రకంగా మన సభను నడపాలని కోరుకుంటూ సెలవు తీసుకుంటున్నాను.

మిస్టర్ ఛైర్మన్ : అందరికీ ధన్యవాదాలు. నన్ను రెండవసారి ఏకగ్రీవంగా, ప్రేమతో, గౌరవంతో అన్నింటినీ మించి నమ్మకంతో ఈ సభకు అధ్యక్షునిగా ఎన్నుకున్నందుకు కృతజ్ఞతాభివందనాలు.

(సభ్యుల హర్షధ్వానాలు)

ముఖ్యంగా గౌరవ ముఖ్యమంత్రి శ్రీ ఎన్. కిరణ్‌కుమార్ రెడ్డి గారికి నా ప్రత్యేక అభివందనాలు. ఎందుకంటే వారు నాపై ప్రత్యేక శ్రద్ధ, చొరవ చూపారు. వారు శాసన సభ సభాపతిగా, నేను శాసన మండలి అధ్యక్షునిగా ఉన్నప్పుడు ఇద్దరం కలిసి సోదర భావంతో, సహృదయంతో పని చేశాము. అరమరికలు లేకుండా మాట్లాడుకోవడం, ఫైల్సు చూడడం, కామన్‌వెల్త్ దేశాల స్పీకర్స్ కాన్ఫరెన్స్‌కు కలిసి పనిచేయడం నాకు కలిసివచ్చిన భాగ్యం. అందుకు వారికి నా ప్రత్యేక కృతజ్ఞతాభివందనాలు. ఈ సందర్భంలో ఒక్క విషయం నాకు గుర్తుకు వస్తున్నది. నేను ఇన్ని పదవులు చేపట్టడానికి కారణం కాంగ్రెస్ పార్టీలో ఒక క్రమశిక్షణ కలిగిన సైనికుడిగా కొన్ని సంవత్సరాలపాటు పనిచేయడమే కాకుండా, రాష్ట్ర, జాతీయ స్థాయిలలోని నాయకులతోటి, రాష్ట్ర ముఖ్యమంత్రులతో, కేంద్రమంత్రులతో కలిసి పనిచేసినటువంటి అనుభవం నాకు ఆస్తిగా పనికి వచ్చిందని మరియు వచ్చిన పదవులను సమర్థవంతంగా నిర్వర్తించడానికి దోహదం చేసిందని నేను భావిస్తున్నాను. నేను ఇక్కడ చెప్పినా, బయట చెప్పినా ఈ సందర్భంగా పార్టీకి కృతజ్ఞతాభివందనాలు తెలియజేస్తూ పార్టీని గుర్తుపెట్టుకుంటానని మనవిచేస్తున్నాను. కానీ, ఈ స్థానంలో కూర్చునప్పుడు నాకు రూల్‌బుక్, రాజ్యాంగం

మాత్రమే గుర్తుంటుంది. ఏదైనా పొరపాటు జరిగితే అధికారులు ఉన్నారు to guide me also, senior members are there to guide me కాబట్టి ఇక్కడ నాకు మార్గదర్శకం రాజ్యాంగం మరియు రూల్సు పుస్తకం. దానినే నేను చాలావరకు గుర్తుపెట్టుకుని పనిచేస్తున్నాను. అన్నింటికన్నా మించి సభ్యులందరూ పార్టీలకతీతంగా సహకరించారు. ఈ సభలో మనమందరం పార్టీలకతీతంగా అనేక అంశాలపై చర్చించడం జరిగింది. అందువల్ల మన రాష్ట్ర శాసన మండలికి మంచి పేరు వచ్చింది. ఇందుకు కారణం మనందరి సమష్టి కృషి అని నేను భావిస్తున్నాను. పార్టీలకంటే కూడా దేశము, ప్రజలు, వారియొక్క అభివృద్ధి ముఖ్యమనే భావనను మనమందరం గుర్తుంచుకున్నట్లయితే చర్చల్లో మంచి సారాంశం వస్తుంది. ప్రజలకు ఉపయోగకరమైనటువంటి సమస్యల పరిష్కారం జరుగుతుంది. కొద్దోగొప్పో మనం ప్రభుత్వానికి సహకరించిన వాళ్లమవుతాము. ప్రభుత్వంలో జరిగిన లోటుపాట్లను చర్చించి సవరణ చేస్తేనే మనకు మంచి పేరు వస్తుంది. అదే పెద్దల సభ. పెద్దలంటే కేవలం పేరుతోనే రాదు, సత్యం, ధర్మం మనం పాటించినప్పుడే మంచి పేరు వస్తుంది. సత్యం, ధర్మం అనేటటువంటివి కాగితాల మీద కాదు, ప్రజల అభివృద్ధికి ఉపయోగపడే కార్యక్రమాలను చేపట్టినప్పుడు కనిపిస్తుంది. జాతిని సమగ్రంగా నడపగలగడం, దేశాన్ని సమగ్రంగా ఉంచగలగడమే ధర్మం, సత్యం పాటించడమని నా అభిప్రాయం. దానిని మరచినప్పుడు పెద్దలకు కూడా చేటు వస్తుంది. అలా కాకుండా చేయవలసిన బాధ్యత మనందరిపైన ఉన్నది. ఈ సభలో విజ్ఞులైన పెద్దలు ఎంతోమంది ఉన్నారు. సభను హుందాగా నడపడానికి, మంచి పేరు సంపాదించడానికి మనం పునరంకితమవుదాం. Re-dedication to the cause of the people of the State. ఈ విధంగా చేసినప్పుడే పెద్దలకు గౌరవం. మేధావులకు తగిన ఇంటెలిజెన్స్ ఉండాలి. ఇంటెలిజెన్స్‌కు తగినటువంటి honour and simplicity ఉండాలి.. ఇవన్నీ ఉన్నప్పుడే ఇది పెద్దలసభ, మేధావుల సభ అనిపించుకుంటుంది.

సా. 5.30

మనకు తిరిగి శాసన మండలిని అందించిన స్వర్గీయ ముఖ్యమంత్రి డా. వై.యస్. రాజశేఖర్ రెడ్డి గారు, ఆ తరువాత వచ్చిన ముఖ్యమంత్రులు డా. కె. రోశయ్య గారు, ఎన్. కిరణ్ కుమారెడ్డి గారు వీరందరి సహకారం ఎంతో ఉంది. ప్రభుత్వం తరఫున సభ సజావుగా నడవడానికి, ప్రజల సమస్యలను పరిష్కరించడానికి ఈ సభలో తమ వంతు పూర్తి సహకారం అందిస్తామని ఇంతకు ముందే ముఖ్యమంత్రిగారు చెప్పడం జరిగింది. అందువల్ల సభాముఖంగా వారికి మరొకసారి ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. నేను మొదటి నుంచి చెబుతున్నదేమంటే, ఏ రంగంలోనైనా, ఏ పార్టీలో పని చేసినా క్రమశిక్షణ ఉంటేనే ఏవైనా పదవులు రావడానికి అవకాశం ఉంటుంది. అంతేగాకుండా, నాయకత్వం ఉన్న లీడర్లు ఉంటేనే ఇవన్నీ సమర్థవంతంగా జరుగుతాయి. అందువలనే ఇందిరాగాంధీ గారి నుంచి సోనియా గాంధీ గారి వరకు కూడా వారందరూ చూపించిన మార్గనిర్దేశం, ప్రేమ నాకు ఎంతో ఉపకరించి నేను ఇక్కడకు రావడానికి దోహదపడుతున్నది. ఈ సందర్భంలో నాకు ఒక విషయం గుర్తుకు వస్తోంది, డా.అంబేద్కర్‌గారు 1949 నవంబరులో రాజ్యాంగ ముసాయిదా బిల్లును ప్రతిపాదిస్తూ “స్వాతంత్ర్యం సంపాదించుకున్నాము, బాగుంది కానీ, వచ్చిన దానిని చేయిజార్చుకోకుండా సక్రమంగా ముందుకు తీసుకువెళ్ళినప్పుడే మనం ధన్యులమవుతాము”ని అన్నారు. స్వాతంత్ర్యం అంటే సమానత్వం ఉండాలి, సౌభ్రాతృత్వం ఉండాలి. ఇవి ఉన్నప్పుడే జాతి పటిష్టంగా ఉంటుంది, అవి మరచిపోయినప్పుడు జాతి నిర్వీర్యం అయిపోయి సమాజం, రాష్ట్రం తద్వారా దేశం ముక్కలైపోతుంది. దీనిని కాపాడే బాధ్యత ఈ చట్ట సభలకు, పార్లమెంటుకు, మనందరిమీద ఉంటుందని ఆయన అన్నారు. అది గుర్తుపెట్టుకుని పనిచేస్తేనే మనమందరము ఏకోన్ముఖులమై వెళ్ళగలుగుతాము, సభా గౌరవాన్ని

కాపాడగలుగుతాము. అదే విధంగా జాతిని ముందుకు తీసుకువెడుతూ, రాష్ట్ర ప్రగతిని తద్వారా దేశ రక్షణను కాపాడగలుగుతాము. సత్యము, ధర్మంతో ప్రజల శ్రేయస్సును కాపాడుతూ ముందుకు వెడితే, ఎంతో పేరు వస్తుందని గతంలో పెద్దలు అన్నారు. దానిని నిర్వర్తించడానికి మీ అందరి సహకారం కోరుతూ, today will dedicate ourselves to the service of the people of the state at large. అందుకు అందరూ కలసి రావలసిందిగా నేను మనవి చేస్తూ, మరొకసారి అందరికీ కృతజ్ఞతలు తెలియజేస్తాను.

(సభలో సభ్యుల చప్పట్లు)

ఈ నాలుగు సంవత్సరాలు నాకు ఎంతో సహకరించిన ప్రతిపక్ష నాయకులు సర్వశ్రీ దాడి వీరభద్ర రావు, పువ్వాడ నాగేశ్వర రావు, జెల్లి విల్సన్, రామయ్య గారు, మోహన్ రెడ్డి మరియు ఇతర సభ్యులందరూ, మంత్రులు ఇతర అధికారులు నాకు ఎంతో గైడెన్స్ ఇచ్చి, నాకు ఒక మంచి దిశను చూపించి నమ్మకాన్ని కలిగిస్తూ, సహృదయంతో సమన్వయంతో ముందుకు నడిపించేవిధంగా ఉన్నారు. బయట ఏం జరిగినా ఫరవాలేదు కానీ, సభలోకి వచ్చిన తరువాత అందరూ కలసికట్టుగా పనిచేశారు. అందరికీ మరొకసారి ధన్యవాదాలు తెలియజేస్తూ, మీ యొక్క సహకారాన్ని పూర్తిగా కాంక్షిస్తూ, సెలవు తీసుకుంటున్నాను.

**ANNOUNCEMENT**

MR.CHAIRMAN: I am to announce to the House that under Rule 10 of the Ad-hoc Rules of Procedure and Conduct of Business in the Andhra Pradesh Legislative Council firstly I will read out the names of the duly nominated members to the Office of the Chairman together with their proposers:

| Sl.No. | Name of the Candidate | Name of the Proposer |
|---|---|---|
| 1. | Sri Nethi Vidyasagar | Dr. A. Chakrapani |
| 2. | Sri Nethi Vidyasagar | Sri Yellareddigari Sivarami Reddy |
| 3. | Sri Nethi Vidyasagar | Sri S. Indrasian Reddy |
| 4. | Sri Nethi Vidyasagar | Sri S. Jagadeeshwar Reddy |
| 5. | Sri Nethi Vidyasagar | Sri Gundumala Thippe Swamy |
| 6. | Sri Nethi Vidyasagar | Sri M. Ranga Reddy |
| 7. | Sri Nethi Vidyasagar | Sri T.G.V. Krishna Reddy |
| 8. | Sri Nethi Vidyasagar | Sri T. Bhanu Prasad Rao |
| 9. | Sri Nethi Vidyasagar | Sri Ponguleti Sudhakar Reddy |
| 10. | Sri Nethi Vidyasagar | Sri B. Mohan Reddy |
| 11. | Sri Nethi Vidyasagar | Sri R. Padma Raju |

As Sri Nethi Vidyasagar is the only candidate duly nominated, I declare Sri Nethi Vidyasagar as elected to the Office of the Deputy Chairman. I heartily congratulate Sri Nethi Vidyasagar on his election as Deputy Chairman and request him to occupy the Chair. I request the Chief Minister, Leader of Opposition and other party leaders to conduct him to the Chair".

(At this stage, as requested by the Chairman, the Hon'ble Chief Minister, Hon'ble Leader of Opposition and other Parties Leaders conducted Sri Nethi Vidyasagar to the Chair, thus Sri Nethi Vidyasagar occupied the Chair and conducted the proceedings of the House)

**(SRI NETHI VIDYASAGAR, DEPUTY CHAIRMAN IN THE CHAIR)**

శ్రీ ఎన్. కిరణ్‌కుమార్ రెడ్డి : అధ్యక్షా, ఇంతకు ముందు చెప్పినట్లుగా శాసన సభకు, మండలికి సభాపతి, ఉపసభాపతి, అధ్యక్షులు, ఉపాధ్యక్షులకు సంబంధించి ఒకేసారి ఎన్నికలు జరుపుకోవడం, ఉపాధ్యక్షులుగా తమరు ఏకగ్రీవంగా ఎన్నిక కావడం, అందరికీ సంతోషకరంగా ఉంది. మీకు అందరి తరఫున, ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీ తరఫున హృదయపూర్వక అభినందనలు.

(సభలో సభ్యుల హర్షధ్వానాలు)

మీరు ఒక ప్రక్క రాజకీయాలలో ఎదుగుదల, కాంగ్రెస్ పార్టీలో నాయకుల దగ్గర నుంచి, డిసిసి అధ్యక్షుల వరకూ కాంగ్రెస్ పార్టీకీ ఎనలేని సేవలనందించారు. సర్పంచ్, మండల ప్రెసిడెంటు నుంచి ఎం.ఎల్.సి. వరకూ ఎదుగుదల, నల్గొండ ప్రాంతం నుంచి ప్రాతినిధ్యం వహిస్తూ, శాసన మండలికి ఉపాధ్యక్షులుగా ఎన్నికవడం మా అందిరికీ చాలా సంతోషంగా ఉంది. గత నాలుగు సంవత్సరాల నుంచి మీరు కూడా ఈ సభలో ఉన్నారు కాబట్టి, శాసనమండలి ఏ విధంగా వచ్చిందనే విషయం తెలుసు కాబట్టి, ఈ సభకున్న ప్రాముఖ్యతను, ప్రాధాన్యతను మరింత పెంచుతారన్న పూర్తి నమ్మకంతో, మరొకమారు కాంగ్రెస్ పార్టీ తరఫున, మా అందరి తరఫున హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తూ, మీకు మంచి జరగాలని కోరుకుంటున్నాను.

సా.5.40.

శ్రీ దాడి వీరభద్రరావు: అధ్యక్షా, డిప్యూటీ ఛైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా మీకు తెలుగు దేశం పార్టీ తరఫున అభినందనలు తెలియజేస్తున్నాము. గత నాలుగు సంవత్సరాలుగా విద్యాసాగర్‌గారు సహ చర సభ్యులుగా, స్నేహపాత్రతతో అందరితో కలిసి ఉన్నారు. ఇప్పుడు ఉపాధ్యక్ష పాత్రను కొత్తగా నిర్వహించబో తున్నారు. ఇటువంటి బాధ్యతాయుతమైన పదవి వచ్చినపుడు దానిని హుందాగా నిర్వర్తించే సామర్థ్యం విద్యా సాగర్‌గారికి ఉంది. అలాగే మండలి సమావేశాలతోపాటు కొన్ని కమిటీలకు కూడా డిప్యూటీ ఛైర్మన్ హోదాతో అధ్యక్షత వహించాల్సి ఉంటుంది. అలాంటి సందర్భంలో కమిటీలకు కూడా ఎక్కువ సమయాన్ని కేటాయించి మీ విద్యుక్త ధర్మాన్ని నెరవేరుస్తారని భావిస్తున్నాము. అదేవిధంగా 'ప్రివిలేజస్ కమిటీకి' సాధారణంగా డిప్యూటీ ఛైర్మన్ నాయకత్వం వహిస్తూ ఉంటారు. ఆ కమిటీ నిర్వహణలో అధిక సమయం కేటాయించి సభ్యుల గౌర వాన్ని కాపాడడానికి ప్రయత్నం చేయాలని కోరుకుంటూ, మీ విద్యుక్త ధర్మాన్ని నెరవేర్చడంలో సమర్థవంతంగా మీ బాధ్యతను నిర్వహిస్తారని ఆశిస్తూ మరొక్కసారి మీకు శుభాకాంక్షలు తెలియజేస్తున్నాము.

శ్రీ జెల్లి విల్సన్: అధ్యక్షా, మీరు ఏకగ్రీవంగా డిప్యూటీ ఛైర్మన్‌గా ఎన్నికైనందుకు భారత కమ్యూనిస్ట్ పార్టీ తరఫున మిమ్మల్ని అభినందించడం జరుగుతోంది. ఈ నాలుగు సంవత్సరాల కాలంలో మా సహచర సభ్యులు గానే గాక 'ప్రభుత్వ హామీల కమిటీ' సభ్యులుగా మీరు అత్యంత విలువైన సూచనలు, సలహాలు ఇచ్చిన సంఘట నలు అనేకం ఉన్నాయి. ఆ కమిటీలో నేను కూడా సభ్యునిగా ఉన్నందున వీటిని వీక్షించే అవకాశం కలిగింది. అలాగే ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలుజరిపే విషయంలో జిల్లా స్థాయి, రాష్ట్ర స్థాయి అధికారులను నిలదీసి వాటి అమలుకు మీరు జరిపిన కృషి అభినందనీయం. నిన్నటి వరకు కాంగ్రెస్ పార్టీకి నాయకుడిగా, కార్యక ర్తగా సమర్థవంతమైన పాత్ర పోషించిన మీరు డిప్యూటీ ఛైర్మన్‌గా కూడా సభ హుందా తనాన్ని పెంచుతూ, అధ్యక్ష స్థానంలో ఎక్కువసార్లు కూర్చునేందుకు అవకాశం తీసుకోవాల్సిందిగా మిమ్మల్ని కోరుతూ మరొకసారి అభినందనలు తెలియజేస్తున్నాను.

శ్రీ బి.మోహన్ రెడ్డిః అధ్యక్షా, శాసనమండలికి డిప్యూటీ ఛైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైనందుకు మీకు అభినందనలు తెలియజేస్తున్నాను. నిన్నటివరకు మా ప్రక్కనే సభ్యులుగా కూర్చొన్న మీరు ఒక్కసారిగా డిప్యూటీ ఛైర్మన్ అయిపోయారు.

(సభలో నవ్వులు)

నల్గొండ జిల్లాలో కాంగ్రెస్‌కు అనేక రకాలుగా సేవ చేయడం వల్ల కేంద్ర, రాష్ట్ర నాయకుల దృష్టిని ఆకర్షించిన మీకు, నాయకత్వ లక్షణాలు ఉన్నాయి కాబట్టే ఆ పదవి మిమ్మల్ని వరించింది. మీ ఎంపికలో ముఖ్యంగా కిరణ్‌కుమార్ రెడ్డిగారు కీలకపాత్ర వహించారు. ప్రాంతీయ విబేధాలు ఉన్న క్లిష్ట సమయంలో పరిపాలన చేయడమే చాలా కష్టం. అలాంటి క్లిష్ట సమయంలో కూడా కిరణ్‌కుమార్ రెడ్డిగారు చాలా చక్కటి నిర్ణయం తీసుకొని ఈ పదవికి మిమ్మల్ని ఎంపిక చేయడం హర్షించదగ్గ విషయం.

అదేవిధంగా, 'ప్రివిలేజస్ కమిటీ' ఛైర్మన్‌గా బహుశా మీరే అధ్యక్ష స్థానంలో ఉండవచ్చు. అలాంటి సమయంలో శాసనమండలి సభ్యుల హక్కులను కాపాడాల్సిన ప్రధాన బాధ్యత మీపై ఉంటుంది కాబట్టి ఒకటే దిక్కు చూడకుండా రెండు మూడు దిక్కులు చూస్తూ శాసమండలి గౌరవాన్ని పెంపొందిస్తారని ఆశిస్తున్నాను. అలాగే మరొక్కసారి మిమ్మల్ని మనస్ఫూర్తిగా అభినందిస్తూ, ఇంకా ఉన్నతమైన పదవులు పొందడానికి ఈ పదవి ఉపయోగపడాలని కోరుకుంటూ అభినందనలు తెలియజేస్తూ ముగిస్తున్నాను.

శ్రీ కపిలవాయి దిలీప్ కుమార్ః అధ్యక్షా, ఏకగ్రీవంగా ఉపాధ్యక్షులుగా ఎన్నికైనందుకు నేను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాను. నాతోపాటు సహచర ఎమ్మెల్సీగా వివిధ జిల్లా సమావేశాలలో పాల్గొన్నపుడు సమీపం నుండే మీ పోరాట పటిమను పరిశీలించడం జరిగింది. ప్రజా సమస్యల మీద మంచి అవగాహన కలిగి అధికారులతో పోరాడుతూ ప్రజలకు లబ్ధి చేకూర్చేవారు. ప్రజా సమస్యల మీద స్పష్టమైన అవగాహన కలిగి ఉన్న ఇలాంటి వ్యక్తి ఈ రోజు ఈ స్థానంలో కూర్చోవడం వల్ల ప్రజలకు మేలు జరుగుతుందని భావిస్తున్నాము. ఇంతకుముందు సహచర సభ్యులు వక్కాణించినట్లు శాసనసభలో చర్చించడానికి అవకాశంలేని అంశాలపై కూడా శాసనమండలిలో చర్చ జరిగినపుడు, చక్కటి డిబేట్స్‌కు ఇక్కడ అవకాశం ఉంటుంది గనుక మీ వంటి ఉన్నత భావాలు కలిగిన వ్యక్తి డిప్యూటీ ఛైర్మన్‌గా ఉండడంవల్ల అందరికీ మేలు జరుగుతుందని ఆశిస్తున్నాము. అలాగే మీకు ఈ పదవి ఆకస్మికమైనప్పటికీ మాకందరికీ సంతోషం కలిగించే విషయమే. రాబోయే కాలంలో మీ పదవి మాకందరికీ కూడా ఉపయోగపడాలని, సభను నిర్వహించడానికి మీకు వచ్చిన అవకాశాన్ని మీరు చక్కగా వాడుకుంటూ, సభకు మరింత శోభ తీసుకువచ్చే విధంగా కృషి చేయాలని, ఆ విధంగా చేయడానికి మీకు సమర్థత ఉందని భావిస్తూ మిమ్మల్ని మరొకసారి అభినందిస్తున్నాను.

శ్రీ కె.రోశయ్య : మిత్రులు విద్యాసాగర్‌గారు సామాన్య ప్రజల మధ్య చిరకాలంగా పనిచేస్తూ ప్రజా సమస్యల మీద బాగా చురుకుగా అధ్యయనం చేసి అర్థం చేసుకొని వారికి ప్రతినిధిగా చట్ట సభలలోకి రావడం హర్షించదగిన విషయం. అలాగే శాసనమండలి సభ్యులుగానే గాకుండా ఈ రోజున మీరు ఉపాధ్యక్షులుగా కూడా ఎన్నిక కావడం మరీ ఆనందించదగ్గ విషయం. మన రాష్ట్రంలో నల్గొండ జిల్లా చాలా చైతన్యవంతమైన జిల్లాగా వినతికెక్కింది. విభిన్నమైన కోణాలలో ఆలోచనలు జరుగుతూ ఉన్న నల్గొండ జిల్లాలో సాధారణ స్థాయికి భిన్నంగా కొద్దిగా ఉద్రిక్తమైన వాతావరణం కూడా అక్కడ ఉంటుంది. అలాంటి జిల్లాలో కేవలం మీ స్వయం కృషితో ప్రత్యేకమైన స్థానాన్ని, గౌరవాన్ని సంపాదించడంవల్ల, ఈ పదవి సాధించడానికి అర్హత కలిగింది.

శాసనమండలి ఉపాధ్యక్షులుగా సమావేశాలను చక్కగా నిర్వహించారనే మాట మీకు రావాలి, అలాగే శాసన మండలి సభ్యులైన మేము కూడా మీకు నిండైన సహాయ సహకారాలు అందించి మండలి ఔన్నత్యం పెంచడానికి సమిష్టిగా కృషి చేస్తామని వాగ్దానం చేస్తూ మరొక్కసారి మీకు శుభాకాంక్షలు తెలియజేస్తూ శెలవు తీసుకుంటు న్నాను.

శ్రీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి (నల్గొండ) : పెద్దలు నేతి విద్యాసాగర్‌గారు శాసనమండలి ఉపాధ్యక్షులుగా ఎన్నికైన సందర్భంగా సహకరించిన గౌరవ ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్ రెడ్డి గారికి, ఏఐసిసి అధ్యక్షురాలు సోని యాగాంధి గారికి నల్గొండ జిల్లా ప్రజల తరపున కృతజ్ఞతలు తెలియజేస్తూ , యూత్ కాంగ్రెస్ కార్యకర్తగా, సర్పంచిగా, ఎమ్మెల్సీగా అంచెలంచెలుగా ఎదుగుతూ, ఈ రోజు డిప్యూటీ ఛైర్మన్‌గా ఎన్నికైనందుకు మీకు శుభా కాంక్షలు తెలియజేస్తున్నాను. గత 30 సంవత్సరాలుగా నల్గొండ జిల్లాలో కాంగ్రెస్ పార్టీతోపాటు, బలహీనవర్గాల ప్రజలకు అండదండగా ఉంటూ వారికి చేసిన సేవకు గుర్తింపుగా మీరు ఏకగ్రీవంగా ఎన్నికైనందుకు నల్గొండ జిల్లా ప్రజలందరూ సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంలో మరొకసారి ముఖ్యమంత్రిగారికి, సోనియా గాంధి గారికి కృతజ్ఞతలు తెలియచేసుకుంటున్నాము. రాబోయే కాలంలో పెద్దల సభలో ఇంకా మంచి పేరు తెచ్చుకుంటారని, నల్గొండ జిల్లా ప్రజలతోపాటు, రాష్ట్రంలోని యావత్ ప్రజలందరి దృష్టిని ఆకర్షిస్తారని ఆశిస్తూ మరొకసారి మీకు శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను.

శ్రీ పొంగులేటి సుధాకర్ రెడ్డి (ఖమ్మం) : అధ్యక్షా, ఇప్పుడే వెంకటరెడ్డిగారు చెప్పినట్లు, వివిధ సమస్యల పరిష్కారంలో అనేక ఉద్యమాల బాటలో కాంగ్రెస్‌లో యువజన నాయకుడుగా ఉన్నప్పటి నుండే ఒక మాస్ లీడ ర్‌గా పేరు తెచ్చుకొన్న మీరు జిల్లా నాయకత్వానికి, రాష్ట్ర నాయకత్వానికి చాలా తోడ్పాటు నందించారు. వెనుకబ డిన వర్గాలతోపాటు అన్ని వర్గాల వారి సమస్యలు మీ దృష్టికి వచ్చినప్పుడు నాయకత్వ పటిమతో వివిధ హోదా లలో ఉండి సమస్యలు పరిష్కరించడంలో మీ ప్రతిభా పాటవాలు సహచరులుగా ఉన్న మాకందరికీ తెలిసిందే.

సా. 5.50,

ఈ రోజు శ్రీమతి సోనియాగాంధీగారి ఆశీస్సులతో, ముఖ్యమంత్రిగారి చేయూతతో కాంగ్రెస్ పార్టీ వారు ఇచ్చినటువంటి ఈ అవకాశానికి, ప్రతిపక్షాలవారందరూ కూడా సహకరించి ఏకగ్రీవంగా ఎన్నికై మీరు ఆ కుర్చీలో కూర్చున్నందుకు మనసా, వాచా అభినందనలూ తెలియచేస్తున్నాను. చక్రపాణి గారితో కలిసి జానీ గారు అడ్వైజర్‌గా, టీంగా ఎన్నో మంచి కార్యక్రమాలు చేశారు. షడ్రుచులు కలిసి ఉండే ఆ రకమైనటు వంటి టీం వర్కుకు ఛైర్మన్, డిప్యూటీ ఛైర్మన్ చక్కగా పేరు తెచ్చుకుంటారని, డిప్యూటీ ఛైర్మన్‌గా హుందాగా సభను నడిపించాలనీ, అన్ని రకాలుగా మీకు మంచి జరగాలని కోరుకుంటూ మీకు ధన్యవాదాలు తెలుపుతూ ముగిస్తున్నాను.

శ్రీమతి సునీతలక్ష్మారెడ్డి(రామాయంపేట): అధ్యక్షా! ఈరోజు మీరు డిప్యూటీ ఛైర్మన్‌గా ఎన్నికయిన సందర్భంగా నా హృదయపూర్వక సుభాకాంక్షలు తెలియచేస్తున్నాను. మిమ్మల్ని డిప్యూటీ ఛైర్మన్‌గా ప్రపోజ్ చేసినటువంటి గౌరవ ముఖ్యమంత్రిగారికి, అదేవిధంగా సభలో, సభా గౌరవాన్ని కాపాడుతూ ఏకగ్రీవంగా సహకరించిన ప్రతిపక్ష నాయకులందరికీ నా హృదయ పూర్వక అభినందనలు తెలియచేస్తున్నాను. ఎం.ఎల్.సిగా మీ యొక్క బాధ్యతను విజయవంతంగా నిర్వహించారు. డి.డి.ఆర్.సి ఛైర్మన్‌గా నేను నల్గొండ జిల్లాకి వచ్చినపుడు అక్కడ ప్రజలకు సంబంధించిన సమస్యల పైన పూర్తి అవగాహన, అనుభవం ఉన్నటువంటి వ్యక్తిగా

ప్రజల సమస్యలను తీర్చడానికి మీరెంతో కృషి చేయడం జరిగింది. మీరు పార్టీ పరంగా గ్రామస్థాయి నుంచి ఎం.ఎల్.సి స్థాయికి రావడం, డి.సి.సి అధ్యక్షుడిగా అందరినీ కలుపుకొని నల్గొండ జిల్లా పార్టీ పటిష్టత కోసం కృషి చేసి మంచి గుర్తింపు తెచ్చుకోవడం జరిగింది. చిరునవ్వుతో అందరినీ పలకరించే మీరు చక్రపాణి గారితో సహకరించి ఈ పెద్దల సభ యొక్క గౌరవాన్ని కాపాడి, ఈ గౌరవాన్ని పెంపొందించే విధంగా మీరు కృషి చేస్తారని ఆసిస్తూ, మరొక సారి మీకు నా హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలియచేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ ఎస్. జగదీశ్వర్ రెడ్డి (మహబూబ్‌నగర్): అధ్యక్షా! శాసన మండలి ఉపాధ్యక్షుడిగా మీరు ఎన్నిక అయిన సందర్భంగా శుభాకాంక్షలు తెలుపుతూ, కాంగ్రెసు పార్టీలో ఒక సామాన్య కార్యకర్త గా జీవితాన్ని ప్రారంభించి అంచెలంచలుగా ఎదిగి ఉన్నత స్థానానికి చేరుకున్నారు. జిల్లా కాంగ్రెసు అధ్యక్షుడిగా, శాసన మండలి సభ్యునిగా మనిద్దరం కలిసి పనిచేసే అవకాశాలు చాలా సార్లు వచ్చాయి. పార్టీలో క్రమశిక్షణ కలిగినటువంటి కార్యకర్తకు ఖచ్చితంగా గుర్తింపు వస్తుందనేదానికి ఇది ఒక నిదర్శనం. పార్టీలో సామాన్య కార్యకర్తగా పనిచేసినటువంటి మిమ్మల్ని గౌరవ ముఖ్యమంత్రిగారు, సోనియాగాంధీ గారు గుర్తించి డిప్యూటీ ఛైర్మన్‌గా మీకు అవకాశాన్ని ఇచ్చినందుకు వారికి కృతజ్ఞతలు తెలుపుతూ, ఈ సభ హుందాగా నడిపించేటందుకు ఛైర్మన్ గారితో మీరు సహకరించి ప్రజా సమస్యల పట్ల పూర్తిగా చర్చ జరిగేటటువంటి అవకాశాన్ని సభ్యులందరికీ ఇచ్చి సభా గౌరవాన్ని ఎప్పుడూ కాపాడతారని కోరుకుంటూ ముగిస్తున్నాను.

శ్రీ జి.తిప్పేస్వామి: అధ్యక్షా! ఒక బలహీన వర్గానికి చెందిన అభ్యర్థి డిప్యూటీ ఛైర్మన్‌గా ఎన్నికయినందుకు మనస్ఫూర్తిగా అభినందనలు తెలియచేస్తున్నాను. భారతదేశ చరిత్రలో ఆంధ్రప్రదేశ్‌లో ఈరోజు ఉదయం నుంచీ సాయంత్రం వరకు జరిగిన కార్యక్రమాలను, విషయాలను సువర్ణాక్షరాలతో లిఖించాలి. ఎందుకంటే 6 నెలల క్రితం ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డిగారు పదవీబాధ్యతలను స్వీకరించినపుడు, కిరణ్‌కుమార్ రెడ్డి గారు అనుభవజ్ఞులేనా, కాదా అని కొందరు సందేహిస్తున్న నేపథ్యంలో, వారి అంచనాలను తలకిందులు చేస్తూ కిరణ్‌కుమార్‌రెడ్డిగారి నాయకత్వంలో ఇప్పటివరకు స్వతంత్ర భారతదేశ చరిత్రలో కనీవినీ ఎరుగని రీతిలో అత్యున్నతమైన నాలుగు రాజ్యాంగ పదవులను, అసెంబ్లీలో స్పీకర్, డిప్యూటీ స్పీకర్, కౌన్సిల్‌లో ఛైర్మన్, డిప్యూటీ ఛైర్మన్ పదవులను ఏకధాటిగా ఏమాత్రం ఒడిదుడుకులు, అడ్డంకులు లేకుండా దిగ్విజయంగా పూర్తి చేసిన ఘనత కాంగ్రెస్‌ప్రభుత్వంలో ముఖ్యమంత్రి శ్రీ కిరణ్‌కుమార్‌రెడ్డి గారికే దక్కినందుకు నేను కిరణ్ కుమార్ రెడ్డి గారిని, ఈ అవకాశం ఇచ్చినటువంటి అఖిల భారత కాంగ్రెసు పార్టీ అధ్యక్షురాలు శ్రీమతి సోనియా గాంధీ గారిని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాను. మంచి అనుభవజ్ఞులైన చక్రపాణిగారు ఛైర్మన్‌గా వారి యొక్క నాయకత్వంలో, వారి యొక్క సహాయ సహకారాలతో మీరు మంచి అనుభవశాలిగా హుందాతనంతో ఈ హౌస్‌ను నడపాలని, దానికి కావాలసిన సహాయ సహకారాలు కూడా మేమందరం మీకు అందిస్తామని తెలియచేస్తున్నాను. శాసనమండలి ఏర్పడి నాలుగు సంవత్సరాలయినప్పటికీ అసెంబ్లీ కంటే కౌన్సిల్ అర్థవంతంగా జరుగుతుందని మంచిపేరు వచ్చింది. శాసన మండలిలో మేధావులు ఉన్నారు, అన్ని సమస్యలను కూలంకషంగా చర్చించి సమాధానం ఇస్తారు అనే నమ్మకం రాష్ట్ర ప్రజలకు ఉంది. అదే విధమైన ఔనత్యాన్ని, గౌరవాన్ని, మర్యాదని ఈ సభకు కలగచేయడానికి డిప్యూటీ ఛైర్మన్‌గా మీరు కృషి చేయాలని కోరుతూ మరొక సారి ధన్యవాదాలు తెలియచేస్తూ ముగిస్తున్నాను.

శ్రీ రుద్రరాజు పద్మరాజు: అధ్యక్షా! సుమారుగా రెండు దశాబ్దాలనుంచి అత్యంత సన్నిహితులుగా చూస్తున్నటువంటి వ్యక్తి మీరు. చైతన్య వంతమైన నల్గొండ జిల్లానుంచి వచ్చినటువంటి మీరు మీ రాజకీయ జీవితాన్ని ఒక సామాన్య కార్యకర్తగా ప్రారంభించి సర్పంచ్‌గా, జిల్లా కాంగ్రెసు అధ్యక్షునిగా విభిన్న స్థాయిల్లో కాంగ్రెసుపార్టీలో పనిచేసి ప్రజల మన్ననలను పొంది పార్టీ పటిష్టతకు మీరు చేసినటువంటి కృషి ఎంతైనా ప్రశంశనీయమైనదని తెలియచేస్తున్నాను. ముఖ్యంగా కాంగ్రెసుపార్టీ అధికారంలో లేనపుడు మీరు, మీ ప్రాంతంలో ఉన్నటువంటి సమస్యలపై ప్రజలతో మమేకమై చేసినటువంటి ఉద్యమాలు ఇంకా ఇప్పటికి మా మస్తిష్కాలలో మెదులుతూనే వున్నాయి. మీరు ప్రజాభిమానంతో స్థానిక సంస్థల ద్వారా చట్ట సభల్లోకి, శాసన మండలికి రావడం ముఖ్యంగా రెండోసారి కూడా శాసన మండలికి ఎంపికైనందుకు అబినందనలు తెలియచేస్తున్నాను. బలహీన వర్గానికి చెందిన ఇద్దరు వ్యక్తులను సభాధ్యక్షులు, ఉపాధ్యక్షులుగ్గా ఎంపిక చేయడం ఈ రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ కిరణ్ కుమార్ రెడ్డి గారి యొక్క ఆలోచన మేరకు వారిద్దరికీ మంచి పదవులను ఇవ్వడం వలన బలహీన వర్గాలను ఉన్నత స్థితికి తీసుకురావాలనే ఆశయానికి ముఖ్యమంత్రిగారితో పాటూ మా అధిష్టానం శ్రీమతి సోనియాగాంధీగారికి కూడా ధన్యవాదాలు తెలియచేస్తున్నాను. నల్గొండ జిల్లా లాంటి చైతన్యమైనటువంటి జిల్లాలో పుట్టి అంచెలంచలుగా ఉన్నత స్థాయికి ఎదిగి, డిప్యూటీ ఛైర్మన్‌గా ఈ అవకాశం రావడం మీకే కాదు యావత్ జిల్లా వాసులకు కూడా ఎంతో ఆనందాన్ని కలిగించిందని అనుకుంటున్నాను. మీరు గ్రాడ్యుయేషన్ వరకూ ఆ ప్రాంతంలోనే చదువుకొని ఆ ప్రాంత వాసులకు అత్యంత సన్నిహితులుగా మెలుగుతూ వారందరికీ చేదోడు వాదోడుగా ఉండి ఈ స్థాయికి ఎదగడం సామాన్యమైన విషయం కాదు. మారు మూల గ్రామంలో జన్మించినటువంటి మీరు ఇంత ఉన్నత స్థానానికి రావడం ఎంతైనా అభినందనీయమని మనవి చేస్తున్నాను. మీ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సి నటువంటి ఒకే ఒక విషయం, ఏదైనా ఒక నిర్ణయం తీసుకున్నపుడు, ఏదైనా ఒక విషయాన్ని అర్థం చేసుకున్నపుడు దానికి ఊగిసలాట లేకుండా ఖచ్చితంగా దానిమీదే నిలబడాలనే ఆలోచన వున్న వ్యక్తి నాకు తెలిసి శ్రీ నేతి విద్యాసాగర్‌గారని మనవి చేస్తున్నాను. ఇటువంటి చక్కని అవకాశం, శాసన మండలి ఉపాధ్యక్షునిగా మీకు రావడం, దీనికి అధ్యక్షులైన శ్రీ చక్రపాణి గారు కూడా అనుభవజ్ఞులైనటువంటి వ్యక్తులుగా మీరిద్దరికి ఉన్నటువంటి సత్సంబంధాలతో ఈ శాసన మండలికి మరింత వన్నె తెచ్చేటటువంటి చర్చలు జరిపి, ప్రజా సమస్యలమీద ఆలోచన చేసే విధంగా మీ యొక్క సమయాన్ని కేటాయించడం ద్వారా మరింత వన్నె తెస్తారని విశ్వసిస్తూ, నాకీ అవకాశాన్ని ఇచ్చినందుకు మీకు మరొకసారి ధన్యవాదాలు తెలియచేస్తూ ముగిస్తున్నాను.

సా.6.00

శ్రీ ఎం.ఎస్. ప్రభాకర రావు( హైదరాబాద్ ) ః అధ్యక్షా, మిమ్మల్ని అభినందించే ముందు మన రాష్ట్ర ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్ రెడ్డి గారికి ధన్యవాదాలు తెలుపుతున్నాను. ముఖ్యంగా తమను డెప్యూటీ ఛైర్మన్‌గా నియమించిన విషయాన్ని ఒకసారి ఆలోచన చేస్తే, అందరితో ఆలోచన చేసి, అందరినీ సంప్రదించి, ఒక చక్కటి వ్యక్తి, నాన్ కాంట్రవర్షియల్, అనుభవం వున్న వ్యక్తి కావాలనే ఉద్దేశ్యంతో ఎంపిక చేసారు కాబట్టి వారికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. నల్గొండ జిల్లాలోని ఒక చిన్న గ్రామానికి చెందిన మీరు చిన్న స్థాయి నుంచి రాజకీయ జీవితాన్ని ప్రారంభించి ఈనాడు ఇంత పెద్ద స్థాయికి రావడం నిజంగా చాలా సంతోషించదగ్గ విషయం .

తమ పేరును డెప్యూటీ ఛైర్మన్ పదవికి ప్రతిపాదించిగానే ఈ రాష్ట్రంలో వున్న పేద, దళిత వర్గాల వారెంతో సంతోషించారు. ఇప్పటి వరకూ మీ యాక్టివిటీస్ కేవలం నల్గొండ జిల్లా వరకే పరిమితమయ్యాయి, ఇప్పుడు అవి రాష్ట్రానికి వ్యాపించబోతున్నాయి.

మన రూల్స్‌కు, ప్రొసీజర్స్‌కూ ఇంకా ఎన్నో రిఫార్మ్స్ రావలసిన అవసరం వుంది. మనం ఇంకా పాత రూల్స్, ప్రొసీజర్స్‌నే ఫాలో అవుతున్నాము. తమ అధ్యక్షతన పెద్దలందరినీ సంప్రదించి మన రూల్స్ అండ్ ప్రొసీజర్స్‌లో మార్పులు చేర్పులూ చేయవలసిన అవసరం వుంది. ఇది మీకు చాలా చక్కని అవకాశం. ఇటువంటి ఇష్యూస్ వచ్చినపుడు కాని, దళితులు, వెనుకబడిన వర్గాల వారికి సంబంధించిన ఇష్యూస్ వచ్చినపుడు కాని, మెంబర్స్ అందరికీ అవకాశాలు కల్పించి, వారికి న్యాయం చేకూర్చే విధంగా చేస్తారనే విశ్వాసం నాకుంది.

నేను ఎక్కువ సమయం తీసుకోకుండా ముగిస్తాను. మీరు డెప్యూటీ ఛైర్మన్‌గా వున్నారు కాబట్టి, డెప్యూటీ ఛైర్మన్ ప్రివిలేజెస్ కమిటీకి, పిటిషన్స్ కమిటీకి ఛైర్మన్ కాబట్టి, ఆ కమిటీలను ఎప్పటికప్పుడు సమావేశపరుస్తూ, వివిధ అంశాలను మానిటర్ చేస్తూ, సభ్యులకు సరియైన విధంగా సరిపడినంతగా సమయం ఇవ్వాలని కోరుకుంటూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ కె.ఎస్. లక్ష్మణ రావు (కృష్ణా, గుంటూరు): అధ్యక్షా, ముందుగా శాసన పరిషత్ డెప్యూటీ ఛైర్మన్‌గా ఎన్నికైనందుకు తమకు నా తరపున, మా పిడిఎఫ్ తరపున హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను. గుంటూరు జిల్లాకు చెందిన మహమ్మద్ జానీ గారు గత నాలుగు సంవత్సరాలుగా డెప్యూటీ ఛైర్మన్‌గా పని చేసారు. ఈ సభ ఏర్పడిన తరువాత చాలా జిల్లాలలో అధికారులు శాసన పరిషత్ సభ్యులను పట్టించుకోలేదు. కాని జానీగారు ప్రివిలేజెస్ కమిటీ ఛైర్మన్‌గా కూడా వున్నారు, వారు సభ్యుల యొక్క ప్రివిలేజెస్‌ను, హక్కులను కాపాడడంలో చాలా కృషి చేసారు. మీరు కూడా శాసన పరిషత్ సభ్యుల హక్కులు కాపాడడంలో కృషి చేయాలని, పేదలకు సంబంధించిన అంశాలపై చర్చ జరిగేటపుడు వాటికి ఎక్కువ ప్రాధాన్యతనివ్వాలని కోరుకుంటూ మరొకసారి మీకు శుభాకాంక్షలు తెలుపుకుంటూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ పొగాకు యాదగిరి (ఆదిలాబాద్): అధ్యక్షా, డెప్యూటీ ఛైర్మన్ గా ఎన్నికైనందుకు మీకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను. మిమ్మల్ని అభ్యర్థిగా ఎన్నుకొన్నందుకు మీ పార్టీ హై కమాండ్‌కు, ముఖ్యంగా ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్ రెడ్డి గారికీ, తరువాత మీరు యునానిమస్‌గా ఎన్నిక కావడానికి కారణభూతులైన మా పార్టీ హై కమాండ్ నారా చంద్రబాబు నాయుడు గారికీ ధన్యవాదాలు తెలియజేస్తున్నాను.

నల్గొండ జిల్లా నుంచి వచ్చిన మీరు ఒక మామూలు కార్యకర్తగా కష్టపడి, సర్పంచ్ స్థాయి నుంచి ఈ స్థాయి వరకూ రావడం చాలా అభినందనీయం . తమరు జిల్లా ప్రెసిడెంట్‌గా కూడా చేసారు. ఈ రకంగా కార్యకర్తలను గుర్తించినందుకు రాజకీయ పార్టీల నాయకత్వాలను అభినందించాలి. మీరు కాంగ్రెస్‌లో వున్నా, నేను తెలుగుదేశం పార్టీలో వున్నా మీతో నాకు చాలా పరిచయాలు వున్నాయి. మీ మనస్తత్వం గురించి నాకు బాగా తెలుసు. మీరు ఎటువంటి వారు, ఎట్లా బిహేవ్ చేస్తారు, ఎవరితో ఎట్లా వుంటారనేది నాకు తెలుసు. ఈ సభ రద్దు కాక ముందు కూడా నేను సభ్యునిగా వున్నాను. అప్పుడు రోశయ్య గారు మా గురువు గారు.

నేను మొట్టమొదటగా కౌన్సిల్‌కు ఎన్నికైనపుడు తిరుపతి నుంచి వస్తూంటే రోశయ్య గారు ఫ్లయిట్‌లో కలిసారు. నేను వారి దగ్గరకు వెళ్లి నమస్కారం చేసి నన్ను ఎన్‌టిఆర్‌గారు ఎంఎల్‌సిగా చేసారు, నేను కొత్తగా ఎంఎల్‌సిగా అయ్యానని చెప్పి పరిచయం చేసుకున్నాను. ఆయన ' రా బాబూ ' అని భుజం మీద తట్టి ' చాలా కష్టపడి పనిచేయాలి, ముఖ్యంగా ప్రతి కౌన్సిల్ సమావేశానికీ తప్పకుండా హాజరు కావాలి, ప్రొసీడింగ్స్ అన్నీ వినాలి, మాట్లాడినా, మాట్లాడకపోకయినా ప్రొసీడింగ్స్ అన్నిటినీ వింటూ వుండాలి, ఆబ్సెంట్ కాకూడదని ' గురువు మాదిరిగా నాకు సలహా ఇచ్చారు.

ఆనాడు మా జిల్లా వాస్తవ్యులు ముఖస్సిర్‌షా  గారు చైర్మన్‌గా వుండేవారు. వారు కూడా చైర్మన్‌గా రెండు సార్లు చేసారు. వారు రెండవసారి చైర్మన్ అయిన 14 మాసాలలోనే కౌన్సిల్ రద్దయింది. ఏది ఏమైనప్పటికీ డెప్యూటీ చైర్మన్‌గా ఎన్నికైనందుకు మీకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను. మీ మనస్తత్వం గురించి మా గౌరవ సభ్యులకు ఒక చిన్న విషయం తెలియజేస్తాను.

میں ادب سے کام لیتا ہوں، اگر کسی نے ادب کیا تو میں نے اس کو جھک کے سلام کیا اور اگر کسی نے ادب نہیں کیا تو بھی میں نے سلام کیا اور اگر کسی نے اکڑ مکڑ کیا تو اکڑ نا اسے معلوم اور اس کو سبق سکھانا مجھے معلوم۔

మీరు ఎట్లా వుండే వారితో అట్లా వుంటారు. మంచి వారితో మంచిగా, చెడ్డగా వుండే వారితో చెడ్డగా, ఎమోషనల్‌గా వుండే వారితో అందుకు తగినట్లుగా, ఎట్లా వుండే వారితో అట్లా వుంటారు. నేను కూడా ఒక కార్యకర్త స్థాయి నుంచి వచ్చాను. ఆదిలాబాదు జిల్లా ప్రెసిడెంట్‌గా పార్టీ ఆవిర్భావంలో పని చేసాను. క్రమశిక్షణ కలిగిన కార్యకర్తలకు గుర్తింపు వుంటుందని మా పార్టీ కూడా చెప్పింది. అదే విధంగా మీకు కూడా ఇంత మంచి అవకాశం కలిగించినందుకు మీ పార్టీ హై కమాండ్‌కూ, ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్ రెడ్డి గారికీ ధన్యవాదాలు తెలియజేస్తూ నాకు ఈ అవకాశం ఇచ్చిన తమకు ధన్యవాదాలు తెలుపుకుంటూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ ఫారూఖ్ హుస్సేన్ (నామినేటెడ్): అధ్యక్షా, అనుభవజ్ఞులైన చక్రపాణిగారు యునానిమస్‌గా చైర్మన్ గాను, యువకులైన మీరు యునానిమస్‌గా డెప్యూటీ చైర్మన్ గాను, ఎన్నిక కావడం చాలా సంతోషించదగ్గ విషయం . మీరు 1975 నుంచీ కాంగ్రెస్ పార్టీలో చురుకైన పాత్ర వహించి ఈ స్థాయికి రావడం మాకు చాలా అదృష్టంగా భావిస్తున్నాను. ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు శ్రీమతి సోనియా గాంధీ గారికి, గులాం నబీ అజాద్ గారికి, చైర్మన్‌గా, డెప్యూటీ చైర్మన్‌గా చక్కగా హౌజ్‌ను నడిపించే వ్యక్తులను నియమించినందుకు మరీ మరీ కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.

మరొక ముఖ్యమైన విషయం ఏమిటంటే, చుక్కా రామయ్య గారు సిద్ధిపేటలో లెక్చరర్‌గా వున్నపుడు నేను వారి స్టూడెంట్‌గా వున్నాను. అదే లెక్చరర్ ఇక్కడ సభ్యులుగా వున్నారు, వారి స్టూడెంట్ నైన నేను ఇదే సభలో సభ్యుడుగా వుండడం నా అదృష్టంగా భావిస్తున్నాను. డెప్యూటీ చైర్మన్‌గా ఎన్నికైన తమకు మరొకసారి శుభాకాంక్షలు తెలియజేసుకుంటూ నాకు ఈ అవకాశం ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలుపుకుంటూ సెలవు తీసుకుంటున్నాను.

సా. 6.10

శ్రీ బి. చంగల్ రాయుడు : అధ్యక్షా, మిమ్మల్ని డెప్యూటీ ఛైర్మన్‌గా ఎంపిక చేసినందుకు, మీరు మొట్టమొదటిసారిగా డెప్యూటీ చైర్మన్‌గా ఎన్నికయినందుకు మా అందరి తరఫున, నా తరఫున శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను. మిమ్మల్ని డెప్యూటీ చైర్మన్ పదవికి అభ్యర్థిగా ఎంపిక చేసినందుకు కృషి చేసినటువంటి మన ముఖ్యమంత్రిగారికి, ఏ.ఐ.సి.సి. అధ్యక్షురాలు సోనియా గాంధీగారికి, యునానిమస్‌గా ఎన్నికయ్యేందుకు ప్రతిపక్ష నాయకులు, శాసన సభా వ్యవహారాల శాఖా మాత్యులు శ్రీ డి. శ్రీధర్ బాబు కూడా చొరవ తీసుకుని కృషి చేశారు. వారందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు. అధ్యక్షా, మీతో కలిసి ఒక కమిటీలో పనిచేసే అవకాశం నాకు కలిగింది. ముఖ్యంగా నల్గొండ జిల్లాలో ఫ్లోరైడ్ ప్రభావిత ప్రాంతాలను చూసినప్పుడు కనుక వాటిని గుర్తుచేసుకుంటే, మీరు అక్కడ చూపించిన చొరవ, సామాన్యులతో మమేకమై కలిసి తిరిగిన పరిస్థితులు, అధికారులతో వ్యవహరించిన తీరు...... ఇప్పుడే గౌరవ సభ్యులు శ్రీ పొగాకు యాదగిరి గారు చెప్పినట్లుగా మంచివారికి మంచి వారు, చెడ్డవారికి చెడ్డ వారుగా, అధికారులతో మంచి వారుగా అందరితో కలిసి త్వరిత గతిన పనులు చేయించడానికి మీరు తీసుకున్న చొరవను మరొకసారి అభినందిస్తున్నాను. లోకల్ బాడీలలో పనిచేసిన ఏ వ్యక్తి అయినా సరే, మండల ప్రెసిడెంటుగాలేదా ఇతర స్థానిక సంస్థలలో ఎన్నికై పని చేసిన వారు లెజిస్లేటివ్ సంస్థల లోకి కనుక వచ్చినట్లయితే, తన నైపుణ్యం చూపించుకోగలగడానికి ఎక్కువ అవకాశం కలుగుతుంది. మీరు కూడా లోకల్ బాడీలలో పనిచేశారు కావున మీరు ఆ అనుభవంతో మంచి పనులు చేస్తారని ఆశిస్తున్నాను. మరికొంత చనువుతో ఒక అడుగు ముందుకు వేసి మరొక విషయం చెప్పదలచాను. ఈ మూడు నాలుగు నెలలైనా మీరు లైబ్రరీలో కూర్చుని పుస్తకాలన్నీ బాగా స్టడీ చేసి, ఫ్రేమ్ చేసేలాగా అప్‌డేటెడ్‌గా చేయడానికి కృషి చేస్తారని ఆశిస్తున్నాను. ముఖ్యంగా ప్రివిలేజస్ కమిటీ మన సభ్యులకు రక్షణ కల్పించే కమిటీ. మహమ్మద్ జానీ గారు డెప్యూటీ ఛైర్మన్‌గా ఎంత చొరవ తీసుకుని పని చేశారో, ఏ విధంగాఅన్ని ఊళ్ళను తిరిగి స్టడీ చేయగలిగారో, మీరు కూడా ఆ విధంగా చేసి, మా అందరికీ రక్షణ కల్పించాలని, మా హక్కులను కాపాడడంలో తగిన విధంగా కృషిచేయాలని మిమ్మల్ని కోరుకుంటూ, మీ టర్మ్‌లో మంచి పేరు తెచ్చుకుని, బాగా పనిచేసి, మంచి ఫలితాలను సాధించాలని వెంకటేశ్వరస్వామిని కోరుకుంటూ, సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ వై.వి.బి. రాజేంద్ర ప్రసాద్ (కృష్ణా): అధ్యక్షా, డెప్యూటీ ఛైర్మన్‌గా మీరు ఏకగ్రీవంగా ఎన్నికైనందుకు మనస్ఫూర్తిగా అభినందనలు తెలియజేస్తున్నాను. నాకు ఎక్కువ సంతోషం కలిగించేదేమిటంటే మీరు స్థానిక సంస్థల నుంచి, సర్పంచుల నుంచి రాజకీయ జీవితాన్ని ప్రారంభించి ఈ రోజు డెప్యూటీ ఛైర్మన్ పదవికి వచ్చినందుకు చాలా సంతోషంగా ఉంది. మీరు ఎక్కిన తొలి మెట్టును మరచిపోరని నేను భావిస్తూ, శాసన మండలిలో సుమారు 30 మంది వరకూ స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులము ఉన్నాము. ఇక్కడ మోహన్ రెడ్డి గారు లాంటి ఉపాధ్యాయ ప్రతినిధులు నోళ్ళేసుకుని, సభ మొత్తాన్ని డామినేట్ చేసేస్తారు. అందువలన మీరు స్థానిక సంస్థల ప్రతినిధిగా, ఆయా సమస్యలను ఎక్కువగా ప్రెజెంట్ చేసి, ప్రభుత్వం ద్వారా పరిష్కరించే విధంగా సహకరిస్తారని నేను ఆశిస్తున్నాను. అదేవిధంగా తెలుగుదేశం అధ్యక్షులు చంద్రబాబు నాయుడు గారు ఇది పెద్దల సభ, దీని ఔన్నత్యాన్ని నిలబెట్టాలని, విధానపరంగా అసెంబ్లీలో పోటీ చేయాలని నిర్ణయం తీసుకున్నా, ఇక్కడ ఆ విధంగా పాలకు పాలు, నీళ్ళకు నీళ్లుగా విడదీస్తూ హంసలా ఒక నిర్ణయం తీసుకుని, మీరు ఏకగ్రీవంగా ఎన్నికవడానికి మంచి అవకాశం ఇచ్చారు. కనుక ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడుగారికి కూడా ఈ సభ అందరి తరఫున అభినందనలు, కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. చివరగా ఈ సభ ఔన్నత్యాన్ని పెంచవలసిన అవసరం ఎంతైనా ఉందని మన పెద్దలందరూ చెప్పారు. చక్రపాణిగారి ఆధ్వర్యంలోనూ, మీ

నాయకత్వంలోనూ సభ ఔన్నత్యం పెరుగుతుందని ఆశిస్తున్నాను. చాలావరకు మా గురువుగారు మహమ్మద్ జానీగారు డెప్యూటీ ఛైర్మన్‌గా చాలా గొప్పగా చేశారు. వారికి హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తూ, ఈ సభ ఔన్నత్యాన్ని పెంపొందించేవిధంగా మనమందరం కలసికట్టుగా ముందుకు వెడదామని తెలియజేస్తున్నాను. సి.ఎం. గారు, ఇతర పెద్దలందరూ చాలా సంతోషంగా ఇక్కడ ఉన్నారు. ఇందాకటి నుంచి సి.ఎం.గారు చక్కగా చిలకలా కిలకిలా నవ్వుతూ, అందరూ కూడా విజయదుందుభిలు మ్రోగించారనో, ఏమో అందరూ మంచి జోష్ మీద ఉన్నారు. కాబట్టి కాంగ్రెస్ ఎం.ఎల్.సి.లకు, జానీ గారు లాంటి సీనియర్లకు కూడా మంత్రులుగా అవకాశం ఇప్పించి, వారికి ప్రమోషన్ ఇప్పిస్తే, మా కౌన్సిల్ యొక్క గుర్తింపు కూడా ఉంటుందని తెలియజేస్తూ, సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ ఎం. సుధాకర్ బాబు (కర్నూలు): డెప్యూటీ ఛైర్మన్‌గా ఎన్నికైనందుకు ముందుగా మా హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తున్నాను. ఈ క్రెడిట్ అంతా ..... ఛైర్మన్‌గా చక్రపాణి గారు కానీ, డెప్యూటీ ఛైర్మన్‌గా మీరు కానీ, పార్టీనే నమ్ముకుని ఉన్న కొంతమంది కార్యకర్తలు నా లాంటి వారిని...... ఈ రోజు ఈ సభకు తీసుకురావడంలో ముఖ్యపాత్ర వహించిన మన ముఖ్యమంత్రి శ్రీ కిరణ్ కుమార్ రెడ్డికి ఈ క్రెడిట్ దక్కుతుందని నేను మనస్ఫూర్తిగా తెలియజేస్తున్నాను. ప్రతి ఒక్కరూ ఎంతో బాధ్యతాయుతంగా ఉండే వారిని మన ముఖ్యమంత్రిగారు ఎన్నిక చేసి, ఈ సభ ఔన్నత్యాన్ని పెంపొందించే విధంగా కృషి చేస్తున్నారు. అదేవిధంగా ఈ సభ్యులను కూడా ఎన్నిక చేశారు. లేకపోతే గతంలో డబ్బులున్న వారికే ఈ సభలో ప్రవేశించడానికి వీలుండేది. కానీ ఈ రోజు పేదలు, నిరుపేదలకు కూడా ఈ సభలో ప్రవేశించే అవకాశం కల్పించిన మన ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్ రెడ్డిగారికి మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. పెద్దలు రోశయ్యగారు, మహమ్మద్ జానీ గారు, చుక్కారామయ్య గారు, పాలడుగు వెంకట్రావుగారు, ఇంకా ఇతర అనుభవజ్ఞులతో పాలు పంచుకునే అవకాశం మాకు కల్పించినందుకు మేము ఎంతో ధన్యులుగా భావిస్తున్నాము. నాకు అవకాశం ఇచ్చినందుకు అందరికీ ధన్యవాదాలు తెలియజేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ బొడ్డు భాస్కర రామారావు (తూర్పుగోదావరి) : ఈ రోజు డెప్యూటీ ఛైర్మన్‌గా ఎన్నికైనందుకు మనందరి తరఫున మీకు శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను. రాజేంద్ర ప్రసాద్ గారు చెప్పినట్లుగా నేను కూడా స్థానిక సంస్థల నుంచి రావడం జరిగింది. రాబోయే కాలంలో మీరు మా అందరికీ అవకాశం ఇచ్చి సభను హుందాగా నడిపించి, సభా మర్యాదను ఇనుమడింపచేసే విధంగా కృషి చేస్తారని, ఈ విషయంలో మా అందరి సహాయసహకారాలు ఉంటాయని తెలియజేస్తున్నాను. నాకు అవకాశం ఇచ్చినందుకు మరొకసారి అభినందలను తెలియజేస్తూ, సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ ఎ. రామమోహన రావు (పశ్చిమగోదావరి) : అధ్యక్షా, నేను ముందు మాట్లాడాలని అనుకోలేదు. కానీ మిమ్మల్ని చూశాక, రెండు విషయాలు మీలో చూశాక మాట్లాడాలని అనిపించింది. ప్రధానంగా మీరు లోకల్ బాడీల నుంచి ఈ స్థాయికి వచ్చారని విన్నాక నేను కూడా గత 20 సంవత్సరాల నుంచి లోకల్ బాడీలలో సర్పంచ్‌గానూ, మండల ప్రెసిడెంట్ గాను పని చేసి వచ్చాను. ఆ కోణం నుంచి మీరు ఎదిగారు కనుక ఆ విధంగా మీకు అభినందనలు తెలియజేయాలని కోరుకుంటున్నాను. రెండవది మీరు డెప్యూటీ ఛైర్మన్‌గా వెనకబడిన తరగతుల నుంచి వచ్చారు. వెనుకబడిన తరగతులకు అవకాశం ఇచ్చినందుకు ఏ పార్టీనైనా సరే అభినందిస్తున్నాను. ఎందుకంటే, మా పార్టీకి బలం లేకపోయినా, పోటీ పెట్టాలని అనుకున్నా, మా నాయకుడు కౌన్సిల్ అనే ఉద్దేశ్యం కాకుండా, వెనకబడిన వర్గాలను గౌరవించాలనే సంకల్పంతో బహుశా పోటీ కూడా

పెట్టలేదేమోనని నేను భావిస్తున్నాను. నాకు ఈ అవకాశం ఇచ్చినందుకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.

మిస్టర్ డెప్యూటీ ఛైర్మన్ : పెద్దలు ఉద్దేశ్యంతో నన్ను ఇక్కడ డెప్యూటీ ఛైర్మన్‌గా చేశారో, పెద్దలు సోనియా గాంధీ గారికి, కిరణ్ కుమార్ రెడ్డి గారికి ప్రత్యేకమైన కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. అదేవిధంగా ప్రతిపక్షసభ్యులందరూ నేను ఏకగ్రీవంగా ఎన్నికయ్యేందుకు సహాయం చేసినందుకు అందరికీ నా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. ఏ ఉద్దేశ్యంతో అయితే నన్ను డెప్యూటీ ఛైర్మన్‌గా ఎన్నిక చేశారో నేను తు.చ. తప్పకుండా నియమావళికి కట్టుబడి, మీ అందరి మన్ననలు పొంది, శాశ్వతంగా మన కౌన్సిల్‌కు మంచి పేరు తెచ్చేవిధంగా కృషిచేస్తానని తెలియజేస్తూ, అందరికీ కూడా నమస్కారాలు తెలియజేస్తున్నాను.

MR. DEPUTY CHAIRMAN: Now, with the consent of the House, I adjourn the House sine die.

(The House then adjourned sine die at 6.20 p.m. followed by National Anthem 'Jana Gana Mana…)

**ఆంధ్రప్రదేశ్ శాసన పరిషత్తు**

**2011, ఫిబ్రవరి 21వ తేది, సోమవారం**

**పధ్నాల్గవ సమావేశపు రెండవ రోజు**

**(సభ ఉదయం 10.00 గంటలకు 'వందేమాతరం' గీతాలాపనతో ప్రారంభమైనది. గౌరవ ఛైర్మన్ అధ్యక్ష స్థానంలో ఉన్నారు.)**

* * * * *